
Crime Mirror
QR Code
https://epaper.crimemirror.com/

# క్రైమ్ మిర్రర్®
Voice of Anti Corruption

హైదరాబాద్
8-11-2024
వెల: రూ.5/-
పేజీలు: 10+10
సంపుటి:13
సంచిక: 363

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD

# నేడు యాదాద్రికి సీఎం రేవంత్



నేడు యాదాద్రికి సీఎం రేవంత్

పుట్టిన రోజు సందర్భంగా ప్రత్యేక పూజలు

యాదాద్రి అభివృద్ధిపై అధికారులతో సమీక్ష

వలిగొండ వద్ద మూసీపునరుజ్జీవ యాత్ర ప్రారంభం

సంగెంలో రైతులతో సమావేశం..సభ

**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి తన పుట్టిన రోజును శుక్రవారం జరుపు కోనున్నారు. ఈ సందర్భంగా ఉదయం 8 గంటలకు ఆయన తన కుటుంబ సమేతంగా యాదాద్రికి వెళ్లనున్నారు. ఉదయం 8:45 గంటలకు యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక పూజలు చేయనున్నారు. ఉదయం 10 గంటలకు యాదాద్రి అధికారులతో ఆలయ అభివృద్ధిపై సీఎం సమీక్ష నిర్వహించనున్నారు. అనంతరం మూసి పునరుజ్జీవ ప్రజా చైతన్య పాదయాత్ర ప్రారంభించనున్నారు. మధ్యాహ్నం 1 గంటకు వలిగొండ మండలం సంగెం నుంచి సీఎం రేవంత్ రెడ్డి ప్రజా చైతన్య పాదయాత్ర చేపడుతారు. మూసీ పరివాహక ప్రాంతంలో 6కిలోమీటర్లు పాదయాత్ర చేయనున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగానే భీమలింగం, ధర్మారెడ్డి కాల్వలను సందర్శించనున్నారు. అనంతరం మూసి పరివాహక ప్రాంత రైతులతో సమావేశం కానున్నారు. రైతుల యోగా క్షేమాలు అడిగి తెలుసుకోనున్నారు. రైతులతో సమావేశం అనంతరం తిరిగి హైదరాబాద్ చేరుకోనున్నారు. ఈ కార్యక్రమ ఏర్పాట్లను ఎంపీ చామల కిరణ్ కుమార్, ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ పర్యవేక్షిస్తున్నారు.

## జైలుకు వెళ్లడానికి నేను సిద్ధమే

యోగా చేసి ట్రిమ్ముగా తయారై వస్తా

నీ ఉడత బెదిరింపులకు భయపడేది లేదు

ఈ రేసింగ్‌తో హైదరాబాద్ ఇమేజ్ పెంచా

మెఘా కంపెనీపై కేసు పెట్టే దమ్ముందా

మీడియా సమావేశంలో కెటిఆర్ హాట్ కామెంట్స్




**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** జైలుకు వెళ్లేందుకు నాకు ఎలాంటి అభ్యంతరం లేదని బిఆర్ఎస్ నేత కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. నా మీద ఎందుకు కేసులు పెడుతావ్.. హైదరాబాద్ ఇమేజ్ పెంచినందుకా..? అని సీఎం రేవంత్ రెడ్డిని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నిలదీశారు. తెలంగాణ భవన్‌లో కేటీఆర్ మీడియాతో మాట్లాడారు.ఫార్ములా-ఈ రేస్ విషయంలో మీడియాకు చెప్పిందే.. అక్కడ చెబుతా. గవర్నమెంట్‌గా నిర్ణయం తీసుకున్నానని చెబుతాను. హైదరాబాద్, తెలంగాణ అభివృద్ధి దృష్ట్యా నిర్ణయం తీసుకున్నాను. నా మీద కేసులు ఎందుకు పెడుతావ్.. హైదరాబాద్ ఇమేజ్ పెంచినందుకా..? లక్షల కోట్లు పెట్టుబడులు తెచ్చినందుకా..?

మిగతా 2లో



అరాచకాలు బయటపడుతుంటే

## భయం పట్టుకుంది


భుజాలు తడుముకుంటున్న కెటిఆర్

చట్టం తనపని తాను చేసుకు పోతుంది

రైతులకు, నిరుద్యోగులకు ఇచ్చిన మాట నిలబెట్టుకుంటాం

తొర్రూరు మార్కెట్ కమిటీ

మిగతా 2లో



## ఉద్యోగాల భర్తీ నిబంధనలు మధ్యలో మార్చకూడదు

నోటిఫికేషన్‌లో పేర్కొన్న అర్హతలకు చట్టబద్ధత ఉంది

జాబితాలో పేరుంటే ఉద్యోగం

పొందే హక్కు ఉన్నట్టు కాదు

సహేతుక కారణాలు ఉంటే మాత్రం సవరించుకోవచ్చు

రాజ్యాంగ ధర్మాసనం తీర్పు

2లో



## పవన్ కళ్యాణ్‌తో హోంమంత్రి అనిత భేటీ

తాజా రాజకీయాలతో పాటు..శాంతిభద్రతలపైన చర్చ

నేరాల అదుపులో ప్రత్యేక దృష్టి సారించాలని పవన్ సూచన



సోషల్ మీడియా

## సైకోల భరతం పట్టాల్సిందే

ఉచ్చనీచాలు లేకుండా మృగాలుగా వ్యవహరిస్తున్నారు

ప్రశ్నించే మహిళలపై అసభ్య పోస్టులు పెడతారా

మండిపడ్డ పిసిసి చీఫ్ వైఎస్ షర్మిల

**అమరావతి, (క్రైమ్ మిర్రర్):** సోషల్ మీడియా.. సమాజ హితాన్ని కాంక్షిస్తుందని ఏపీ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తెలిపారు. అలాంటి సోషల్ మీడియాను కొంత మంది సైకోలు, సైకో పార్టీలతో కలిసి ఉచ్చ నీచం లేకుండా భ్రష్టు పట్టించారని ఆమె మండిపడ్డారు. మావన సంబంధాలు, రక్త సంబంధాలను సైతం మరిచి మృగాలుగా మారని ఆవేదన వ్యక్తం చేశారు.

మిగతా 2లో



## డిప్యూటి సీఎం శాంతిభద్రతలు లేవంటే..అర్థం

దళిత హోంమంత్రి మీద ఇంత అక్కసా

చంద్రబాబును ప్రశ్నించే ధైర్యం పవన్‌కు లేదు

మాజీ సీఎం, వైకాపా అధినేత జగన్ విమర్శలు



2లో

## వచ్చే నెల్లో పాదయాత్రలు, సభలు

ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టడమే లక్ష్యం

వచ్చే నాలుగేళ్లు నేతలంతా ప్రజల్లోనే ఉండాలి

బీజేపీ రాష్ట్రస్థాయి వర్క్‌షాప్‌లో నిర్ణయం

రాష్ట్రంలో బీఆర్ఎస్, కాంగ్రెస్‌ను ఖతం చేస్తాం

కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి

హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలతో పాటు ఎన్నికల హామీలను అమలుచేయకపో వటాన్ని ఎండగడుతూ డిసెంబర్ మొదటివారంలో అసెంబ్లీ నియోజకవర్గాల్లో పాదయాత్రలు, సభలు నిర్వహించాలని బీజేపీ నిర్ణయించింది.

# అరాచకాలు బయటపడుతుంటే భయం పట్టుకుంది



(మొదటి పేజీ తరువాయి)

మహబూబాబాద్,నవంబర్7(ఆర్ఎన్ఎ): 'గుమ్మడి కాయల దొంగ అంటే.. భుజాలు ఎందుకు తడుముకుంటున్నవ్ కేటీఆర్..?' అని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రశ్నించారు. కేటీఆర్.. నువ్వు చేసిన తప్పేంటో నీకు తెలుసు.. పడబోయే శిక్ష ఏంటో నీకు తెలుసు' అని అన్నారు. 11 నెలలుగా బీఆర్ఎస్ ప్రభుత్వ అరాచకాలు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయని అన్నారు. గురువారం తొర్రూర్ వ్యవసాయ నూతన మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకార సభలో ఆయన మాట్లాడుతూ.. 'తల తాకట్టు పెట్టయిన డిసెంబర్ లోపు 13 వేల కోట్ల రుణమాఫీ చేస్తామని అన్నారు. 'రుణమాఫీ అయ్యాక నీ తల ఏ టైర్ కింద పెడతావో ఆలోచించుకో' అని అన్నారు. తాను బీఆర్ఎస్‌లో చేరే సమయంలో కేసీఆర్‌ను తండ్రిలా భావించి కాళ్లు మొక్కానని అన్నారు. కానీ తడిగుడ్డతో గొంతు కోశారని ఆవేదన వ్యక్తం చేశారు. తనకు నాలుగు గోడల మధ్య కాళ్లు పట్టుకొనే అవసరం లేదని అన్నారు. ఎర్రబెల్లి దయాకర్ రావు 'పొంగులేటి హోం మంత్రా..? అలా ఎందుకు మాట్లాడుతున్నారు' అని అంటున్నారని, తాను క్యాబినెట్ మంత్రినని, అన్ని విషయాలూ మాట్లాడుతానని అన్నారు. కేటీఆర్ పాదయాత్ర చేస్తానని అంటున్నారని, పాదయాత్ర చేస్తారో.. మోకాళ్ల యాత్ర చేస్తాడో నిర్ణయం ఆయనే తీసుకోవాలని పొంగులేటి ఎద్దేవా చేశారు. తాను ఆ పార్టీ, ఈ పార్టీ నేతలను అరెస్టు చేస్తారని ఎక్కడా చెప్పలేదని తెలిపారు. దానికి శ్రీనివాస్ రెడ్డి అదాని కాళ్లు మొక్కాడని ప్రచారం చేస్తున్నారని ఫైర్ అయ్యారు. తనకు చట్టం తెలుసునని, ఎప్పుడు, ఎక్కడ ఏం జరగాలో అది జరుగుతుందని అన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ హాట్ కామెంట్స్ చేశారు. రాష్ట్ర ప్రజలు మార్పు కావాలని ఇందిరమ్మ రాజ్యం తీసుకొచ్చారని అన్నారు. గత ప్రభుత్వం 7 లక్షల 19 కోట్ల రూపాయలు అప్పు చేసి ఇప్పుడు విమర్శలు చేస్తున్నారు.. ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. ఇందిరమ్మ ప్రభుత్వం మీద బావ బావమరిది తప్పుడు ప్రచారు చేస్తున్నారని దుయ్యబట్టారు. ప్రత్యక్షంగా రైతుల కోసం ఇప్పటి వరకు రూ. 18 వేల కోట్లు రుణమాఫీ చేశాం.. మిగతా 12 వేల కోట్ల రుణమాఫీ చేస్తామని మంత్రి పొంగులేటి తెలిపారు. బావ బావమరిది తల ఎక్కడ పుట్టుకుంటర్లో అప్పుడు చెప్తుతామని అన్నారు. పేదల పక్షపాతి ప్రభుత్వం కాబట్టి రైతుబంధు కొంచెం ఆలస్యమవుతుందని మంత్రి అన్నారు. తాము ఇచ్చే స్మార్ట్ కార్డు ప్రభుత్వం ఇచ్చే ప్రతి పథకానికి అని తెలిపారు. ఇందిరమ్మ ప్రభుత్వం వచ్చిన తర్వాత ధరణిలో విదేశాల సంస్థలకు ఇచ్చిన భూమిని మళ్ళీ తీసుకొస్తున్నాం.. దేశంలో ఎక్కడ లేనటువంటి కొత్త రెవెన్యూ చట్టాన్ని తీసుకొస్తున్నామని పేర్కొన్నారు. తప్పు చేస్తే పేదవాడి సొమ్మును కొల్లగొడితే పేదవాడికి కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు. గుమ్మడికాయ దొంగ అంటే కేటీఆర్ ఎందుకు భయపడుతున్నావో చెప్పాలన్నారు. నీవు ఎందుకు పాదయాత్ర చేస్తున్నావో ప్రజలకు చెప్పాలని తెలిపారు. మనిషిని మనిషిలా గౌరవించని మీరు.. పదవిపోయే సరికి ఇష్టం వచ్చినట్టు మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు. చట్టానికి తెలుసు.. ఎప్పుడు, ఎక్కడ ఏమి జరగాలో తెలుసు.. త్వరలో చట్టం తన పని తాను చేసుకుంటూ పోతుందని మంత్రి పొంగులేటి తెలిపారు. రైతులకిచ్చిన మాటని తుచ తప్పకుండా చేస్తామన్నారు. రైతన్నలకి, నిరుద్యోగులకు ఈ ప్రభుత్వం చిత్త శుద్ధితో పని చేస్తుందని అన్నారు. రాబోయే స్థానిక ఎన్నికల వరకు కొత్త పింఛన్లు, రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, కొత్త రేషన్ కార్డులు అన్ని పథకాలు ఇచ్చి తీరుతామని మంత్రి పొంగులేటి తెలిపారు. కార్యక్రమంలో పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్ చార్జి అనుమాండ్ల ఝాన్సీరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతి రెడ్డి అలాగే ప్రభుత్వ విప్ రామచంద్రు నాయక్, ఎమ్మెల్యే మురళీ నాయక్, ఎంపీలు, బలరాం నాయక్, కడియం కావ్య పాల్గొన్నారు.

# ఉద్యోగాల భర్తీ నిబంధనలు మధ్యలో మార్చకూడదు

(మొదటి పేజీ తరువాయి)

**న్యూఢిల్లీ, (క్రైమ్ మిర్రర్):** సుప్రీంకోర్టు గురువారం కీలక నిర్ణయం తీసుకుంది. ఉద్యోగ నియామకాలకు సంబంధించి ఎంపిక ప్రక్రియ ప్రారంభమైన తర్వాత ప్రభుత్వ ఉద్యోగాల్లో నియామకాలకు సంబంధించిన నిబంధనలను మార్చలేమని కోర్టు పేర్కొంది. పోస్టుల ఎంపిక ప్రక్రియ ప్రారంభమైన తర్వాత నియమాలను మధ్యలో మార్చలేమని సుప్రీం కోర్టు రాజ్యాంగ ధర్మాసనం తీర్పు చెప్పింది. ఈ కేసు రాజస్థాన్ హైకోర్టులో ఓ ప్రభుత్వ పోస్టు రిక్రూట్‌మెంట్‌కు సంబంధించినది. ప్రధాన న్యాయమూర్తి డివై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ మేరకు తీర్పుల చెప్పింది. సీజేఐ చంద్రచూడ్ నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం ఈ నిర్ణయం తీసుకుంది. జస్టిస్ హ్రిషికేశ్ రాయ్, జస్టిస్ పీఎస్ నరసింహ, జస్టిస్ పంకజ్ మిత్తల్, జస్టిస్ మనోజ్ మిశ్రా బెంచ్ ఈ తీర్పును వెలువరించింది. 2008లో కె.మంజుశ్రీ వర్సెస్ ఆంధ్రప్రదేశ్ కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును బెంచి సమర్థించింది. ఆ కేసు తీర్పు సరైనదని.. దానిని తప్పు అని చెప్పడానికి అవకాశం లేదని పేర్కొంది. 'ప్రభుత్వాలు నియామక ప్రక్రియకు ముందే నిబంధనలు సిద్ధం చేసి ఆ తర్వాతే అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానించాలి. చివరికి ఖాళీలను పూరించిన తర్వాత ఆ ప్రక్రియ ముగుస్తుంది. నిబంధనలు మార్చొచ్చని ముందుగానే చెబితే పర్వాలేదు. నియామక ప్రక్రియ నిబంధనలు ఎవరికి నచ్చినట్లు వారు మార్చడానికి వీల్లేదు. కచ్చితంగా రాజ్యాంగంలోని ఆర్టికల్ 14కు అనుగుణంగా ఉండాల్సిందే. ప్రభుత్వ ఉద్యోగ నియామకాలు పారదర్శకంగా, నిష్పక్షపాతంగా ఉండాలి. మధ్యలో నిబంధనలు మార్చి అభ్యర్థులను ఇబ్బందిపెట్టరాదు.' అని ధర్మాసనం పేర్కొంది.

## సోషల్ మీడియా సైకోల భరతం పట్టాల్సిందే

(మొదటి పేజీ తరువాయి)

మహిళలనే జ్ఞానం లేకుండా ఇంట్లో తల్లి, చెల్లి, అక్కా కూడా సాటి మహిళలే అనే కనీస ఇంగితం వారికి లేకుండా పోయిందన్నారు. రాష్ట్రంలో ప్రశ్నించే మహిళలపై అసభ్యకరంగా పోస్టులతో, వికృత చేష్టలతో వారంతా ఓ విధమైన రాక్షస ఆనందం పొందారని చెప్పారు. సోషల్ సైకోల బాధితుల్లో తాను ఒకరినని ఈ సందర్భంగా వైఎస్ షర్మిల పేర్కొన్నారు. అసభ్యకర పోస్టులతో ప్రతిష్ట దెబ్బతినేలా వ్యవహరిస్తున్నారని చెప్పారు. అలాంటి పోస్టులు పెట్టి.. పైశాచిక ఆనందం పొందే సైకోలపై కఠినంగా చర్యలు తీసుకోవాలని కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తన మీద.. తన కన్నతల్లి మీద.. చిన్నాన్న కుమార్తె వైఎస్ సునీతపై విచ్చలవిడిగా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారని ఈ సందర్భంగా వైఎస్ షర్మిల గుర్తు చేసుకున్నారు. తాను వైఎస్ రాజశేఖర్ రెడ్డి గారికే పుట్టలేదంటూ సోషల్ మీడియాలో అవమానించారని తెలిపారు. తన ఇంటి పేరు మార్చి శునకానందం పొందారని సైకోలపై వైఎస్ షర్మిల ఈ సందర్భంగా నిప్పులు చెరిగారు. తనపై అసభ్యకర పోస్టులు పెట్టిన వర్రా రవీందర్ రెడ్డిపై తాను సైతం గతంలో పోలీస్ కేసు పెట్టిన విషయాన్ని ఈ సందర్భంగా వైఎస్ షర్మిల వివరించారు. అటువంటి సైకోను ప్రభుత్వం అరెస్ట్ చేయడాన్ని తాను స్వాగతిస్తున్నానన్నారు. అరాచక పోస్టులు పెట్టే వాళ్ళు ఏ పార్టీలో ఉన్నా.. వారి అంతు చూడాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వానికి వైఎస్ షర్మిల విజ్ఞప్తి చేశారు. మరోసారి సోషల్ మీడియాలో వ్యక్తిత్వ హననానికి పాల్పడాలంటే భయపడేలా వారిపై కఠిన చర్యలు తీసుకునేలా ఉండాలని ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వంలోని భాగస్వామ్య పక్ష పార్టీలైన అఏజీతిఆఖ అఏజీనిజా।నిజీఖజీసబా అఃఏఖ4ంనిటరసజీకు వైఎస్ షర్మిల సూచించారు. ఈ మేరకు వైఎస్ షర్మిల తన ఎక్స్ ఖాతా వేదికగా గురువారం ఈ విధంగా స్పందించారు.

## పవన్ కళ్యాణ్‌తో హోంమంత్రి అనిత భేటీ

(మొదటి పేజీ తరువాయి)



**అమరావతి, (క్రైమ్ మిర్రర్):** హోంమంత్రిపై పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యల అనంతరం ఏపీ రాజకీయాలు వేడెక్కిన క్రమంలో హోంమంత్రి అనిత డిప్యూటి సిఎం పవన్ కళ్యాణత్‌తో భేటీ అయ్యారు.డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, హోంమంత్రి అనిత మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఫేక్ పోస్టులపై ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై చర్చించారు. గత కొన్ని రోజులుగా రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలు, హోం శాఖ తీసుకుంటున్న చర్యలను పవన్ కల్యాణ్‌కు అనిత వివరించారు. చిన్నారులు, మహిళలపై జరుగుతున్న నేరాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఆడబిడ్డలకు అన్యాయం చేసిన వారిని చట్టప్రకారం కఠినంగా శిక్షించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు అనిత తెలిపారు. జన సంక్షేమం, శ్రేయస్సు కోసం ప్రతిక్షణం శ్రమించే ప్రజా ప్రభుత్వం మన కూటమి ప్రభుత్వమని నేతలు చర్చించుకున్నారు. తానూ ఫేక్ పోస్టు బాధితురాలినంటూ అంటూ అనిత పవన్ కల్యాణ్‌తో అన్నారు. తన కూతురు కన్నీరు చూసే తాను ఇటీవల కొన్ని వ్యాఖ్యలు చేశానని పవన్ వెల్లడించారు. ఈ క్రమంలో హోం మంత్రి అనిత ఆసక్తికర పోస్ట్ చేశారు. రాష్ట్ర సచివాలయంలో గురువారం డిప్యూటీ సీఎం కొణిదెల పవన్ కల్యాణ్ తో మర్యాదపూర్వకంగా సమావేశమైనట్లు పేర్కొన్నారు. గత కొన్ని రోజులుగా రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలు, హోంశాఖ తీసుకుంటున్న చర్యలను ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. చిన్నారులు, మహిళలపై జరుగుతున్న నేరాల విషయంలో ప్రత్యేకంగా దృష్టి సారించాలని, ఆడబిడ్డలకు అన్యాయం చేసిన వారిని చట్టప్రకారం కఠినంగా శిక్షించేలా గట్టి చర్యలు తీసుకోవాలని పవన్ కల్యాణ్ సూచించారన్నారు. జన సంక్షేమం, శ్రేయస్సు కోసం ప్రతిక్షణం పరిశ్రమించే ప్రజా ప్రభుత్వం తమ కూటమి ప్రభుత్వం అంటూ అనిత పేర్కొన్నారు. ఇటీవల పిఠాపురం పర్యటనలో రాష్ట్రంలో జరుగుతున్న హత్యలు, అత్యాచారాలపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో హోం మంత్రి బాధ్యత వహించాలని.. మరింత కఠినంగా వ్యవహరించాలంటూ పవన్ కల్యాణ్ సూచించారు. అయితే.. ఈ వ్యాఖ్యలపై స్పందిచిన హోంమంత్రి అనిత.. దీనిని తాను పాజిటివ్‌గా తీసుకుంటున్నానని చెప్పారు.. హోంమంత్రిగా తాను ఫెయిల్ అని పవన్ ఎక్కడా అనలేదని.. పవన్ వ్యాఖ్యలను వక్రీకరిస్తున్నారంటూ ఫైర్ అయ్యారు.

## డిప్యూటి సిఎం శాంతిభద్రతలు లేవంటే..అర్థం

**అమరావతి, (క్రైమ్ మిర్రర్):** డిప్యూటీ సీఎం స్థాయి వ్యక్తి లా అండ్ ఆర్డర్ లేదని అనటం ఆశ్చర్యంగా ఉందని మాజీ సీఎం, వైసీపీ అధినేత వైఎస్ జగన్ అన్నారు. దళిత మంత్రి మీద విమర్శలు చేసి ఊరుకున్నారని.. లా అండ్ ఆర్డర్ గురించి ప్రశ్నించాల్సింది చంద్రబాబుని అంటూ ఆయన పేర్కొన్నారు. చంద్రబాబును ప్రశ్నించే ధైర్యం పవన్‌కు లేదన్నారు. దళిత మహిళ కాబట్టి పడుతుంది అని పవన్ ఆమెపై విమర్శలు చేశారన్నారు. సొంత నియోజకవర్గంలో అత్యాచారం చేస్తే పవన్ ఏం చేశారని జగన్ ప్రశ్నించారు. సినిమా డైలాగ్‌లు కొట్టమంటే మాత్రం పవన్ తోలు తీస్తా అని డైలాగ్‌లు కొడతారంటూ ఎద్దేవా చేశారు. డీజీపీ చట్టం వైపు, న్యాయం వైపు నిలబడాలన్నారు. డీజీపీకి మా ప్రభుత్వ హయంలో మంచి పదవి ఇచ్చామన్నారు. పదవీ వ్యామోహంతో డీజీపీ ఇలా తయారయ్యాడని విమర్శించారు. డీజీపీ అధికార పార్టీ కార్యకర్తల మాదిరి మాట్లాడుతున్నారని ఆరోపించారు. ప్రస్తుత ప్రభుత్వంలో పోలీసులు సరిగా పనిచేస్తే అత్యాచారాలు, హత్యలు ఎందుకు జరుగుతాయని ప్రశ్నించారు.సుప్రీం కోర్టు ఆదేశాలను కూడా వెటకారం చేస్తున్నారని మండిపడ్డారు. ఇదే రీతిలో వ్యవహరిస్తున్న పోలీసులు ప్రభుత్వం ఎప్పుడు ఇదే ఉండదు అని తెలుసుకోవాలన్నారు. పోలీసులపై ప్రైవేట్ కేసులు వేస్తామన హెచ్చరించారు. జమిలి గిమిలి అంటున్నారని.. అధికారం కూడా త్వరగా కోల్పోవచ్చని జగన్ జోస్యం చెప్పారు. లేకపోయినా నాలుగేళ్ల సమయం మాత్రమే ఉంటుందన్నారు. తర్వాత వైసీపీ ప్రభుత్వం వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. రిటైర్ అయ్యాక కూడా పోలీసుల సంగతి కూడా చూస్తామన్నారు.సప్త సముద్రాల అవతల ఉన్నా పోలీసులను ఇక్కడకు పిలిపిస్తామన్నారు. చేసిన తప్పులను బయటకు తీసి చట్టం ముందు దోషులుగా నిలబెడతామని హెచ్చరించారు. రెడ్ బుక్ పెట్టడం వాళ్లకు మాత్రమే తెలుసా.. రెడ్ బుక్ పెట్టడం పెద్ద విషయం కాదన్నారు. బాధితులు అందరూ రెడ్ బుక్ పెట్టుకుంటారన్నారు. వాళ్లు అందరూ వచ్చి నాకు వినతులు ఇస్తే చూస్తూ ఊరుకోనన్నారు. వెయ్యి ఎకరాల్లో 4 ఎకరాలు ప్రభుత్వ భూమి ఉందని.. ఆ ప్రభుత్వ భూమి కూడా తీసుకోలేదని ఎమ్మార్వో చెప్పిందని జగన్ వెల్లడించారు. అలాంటి చోటుకి పవన్ వెళ్లారన్నారు. పక్కనే భవ్య సిమెంట్స్ వాళ్లు ఎకరం 50 నుంచి 90 వేలకు కొన్నారని.. మేం ఎకరం 3 లక్షలకు తక్కువకు కొనలేదని జగన్ చెప్పారు. గ్రామ సభల్లో ఎకరం 2.70 లక్షలు అడిగితే తాను 3 లక్షలు ఇవ్వాలని చెప్పానన్నారు. తాడిపత్రి దివాకర్ రెడ్డిపై అనేక ఆరోపణలు గతంలో వచ్చాయన్నారు. తాను తీసుకున్నది అంతా ప్రైవేట్ భూములు మాత్రమేనని జగన్ వెల్లడించారు. సిమెంట్ ఫ్యాక్టరీ లకు నీరు ఇవ్వటం ప్రభుత్వ బాధ్యత కాదా అంటూ ప్రశ్నించారు. పవన్ అసలు ఎలా మంత్రి అయ్యారో అర్థం కాదని ఎద్దేవా చేశారు. పవన్‌కు ఏం బుద్ధి ఉందో ఏం జ్ఞానం ఉందో ఏంటో అంటూ విమర్శించారు. గతంలో చంద్రబాబు నన్ను ఇబ్బంది పెడితే కోర్టుకు వెళ్ళగా అనుకూలంగా తీర్పు ఇచ్చిందన్నారు. పరిశ్రమలు పెట్టే జిందాల్ కడపలో పరిశ్రమ పెట్టడం కోసం పనులు మొదలు పెట్టారన్నారు. జిందాల్‌ను ఇబ్బంది పెట్టడం కోసం జిత్వానీతో తప్పుడు ఫిర్యాదులు చేయించి ఇబ్బంది పెట్టారని అన్నారు.ఒరిస్సాలో ఆర్సెల్లర్ మిట్టల్ పరిశ్రమ పెడితే ఇక్కడ కూడా పెడుతున్నారు అంటూ ప్రచారం చేస్తున్నారన్నారు. సరస్వతి పవర్ కట్టక పోవటానికి కారణం టీడీపీ కాంగ్రెస్ వాళ్ళే కదా అంటూ విమర్శించారు. వీళ్ళ కేసులు వల్లే సరస్వతి భూములు ఈడీ అటాచ్ చేసిందని జగన్ అన్నారు.

## వచ్చే నెల్లో పాదయాత్రలు, సభలు

(మొదటి పేజీ తరువాయి)

వచ్చే నాలుగేళ్లపాటు (2028లో అసెంబ్లీ ఎన్నికల వరకు) నిరంతరం ప్రజల్లోనే ఉంటూ, ప్రజా సమస్యలపై పోరాడాలని తీర్మానించింది. గురువారం నగరంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో జరిగిన రాష్ట్ర పార్టీ సంస్థాగత ఎన్నికల స్టేట్ లెవల్ వర్క్ షాప్ లో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ధాన్యం కొనుగోలు విషయంలో రైతులు తీవ్ర సమస్యలు ఎదుర్కొంటున్నందున శనివారం రాష్ట్రంలోని ధాన్యం కోనుగో లు కేంద్రాలను పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఇతర ముఖ్యనేతలు సందర్శించాలని నిర్ణయించారు. మూసీ పరీవాహక ప్రాంతాల్లో నివసించాలని ప్రతి పక్షాలకు సీఎం రేవంత్‌రెడ్డి సవాల్ విసిరిన నేపథ్యంలో.. ఆ ప్రాంతాల్లోని ఇళ్లల్లో బీజేపీ నేతలు 'మూసీ నిద్ర' చేసి అక్కడి ప్రజలు ఎదుర్కుంటున్న సమస్యలను సర్కార్ దృష్టికి తీసుకురావాలని నిర్ణయించారు. కాంగ్రెస్ సర్కార్ అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే తెలంగాణ ప్రజల పరిస్థితి పెనం మీది నుండి పొయ్యిలో పడ్డట్టుగా తయారైందని కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై 11 నెలల్లోనే ప్రజల్లో తీవ్ర వ్యతి రేకత వచ్చిందని తెలిపారు. గతంలో తెలంగాణను పట్టి పీడించిన బీఆర్ఎస్ రూ.7 లక్షల కోట్ల అప్పు చేస్తే, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం కూడా భూము లు తాకట్టు పెట్టి అప్పుల కోసం అన్వేషణ సాగి స్తోందని మండిపడ్డారు. ఇలాంటి పరిస్థితుల్లో రాష్ట్రంలో కాంగ్రెస్, బీఆర్ఎస్‌లకు బీజేపీనే సరైన రాజకీయ ప్రత్యామ్నాయమని తేలిపోయిందని అన్నారు.

# జైలుకు వెళ్లడానికి నేను సిద్ధమే

ప్రపంచపటంలో హైదరాబాద్‌ను నిలబెట్టినందుకా..? బెంగళూరును దాటి హైదరాబాద్‌లో ఐటీ ఎగుమతులు పెంచినందుకా..? పారిపోతాయన్న కంపెనీలను కాపాడినందుకా..? దిగ్గజ కంపెనీలకు డ్రీమ్ డెస్టినేషన్‌గా మార్చినందుకా..? కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్ర పిల్లల భవిష్యత్‌కు బంగారు బాటలు వేసినందుకా..? అని సూటిగా ప్రశ్నించారు. అటెన్షన్ డైవర్షన్ గేమ్‌లతో రేవంత్ రెడ్డి ఎక్కువ రోజులు తప్పించుకోలేడు. నువ్వు ఎన్ని వేషాలు వేసినా.. మేం నిన్ను విడిచిపెట్టం. ఆరు గ్యారెంటీలను వదిలిపెట్టం. అప్పుడప్పుడు నువ్వు గోకినట్టు చేస్తే మేం కూడా వివరణ ఇస్తాం ఎందుకంటే ప్రజలకు వాస్తవాలు తెలియాలి. ఇన్ని చెప్పినా కూడా కేసు పెడుతాం అంటే నీ ఇష్టమున్న కేసు పెట్టుకో అని రేవంత్ రెడ్డికి కేటీఆర్ తేల్చిచెప్పారు. కేటీఆర్ టార్గెట్ అని పేపర్లలో రాస్తున్నారు. ఆరు గ్యారెంటీల అమలు, వడ్ల కొనుగోలు, రైతుబంధు, దళితబంధు, స్కూటీలు ఇచ్చుడు, తులం బంగారం ఇచ్చుడు, గురుకులాలు బాగు చేసే విషయంలో టార్గెట్ ఉండాలి.. టార్గెట్ కేటీఆర్ కాదు. వేస్తే వేసుకో.. నాకేం ఫరక్ పడేది లేదు. ఓ రెండు, మూడు నెలలు జైల్లో పెట్టి పైశాచిక ఆనందం పొందుతా అంటే నాకేం అభ్యంతరం లేదు. మంచిగా పోతా.. యోగా గిగా చేసుకోని ట్రిమ్‌గా వస్తా.. పాదయాత్ర ఎక్కుతా. నేను భయపడేటోని కాదు. ఈ ఉడుత ఊపులకు భయపడను. గాసిప్స్ పక్కకు పెట్టి.. గవర్నమెంట్ మీద దృష్టి పెట్టాలని రేవంత్ రెడ్డికి కేటీఆర్ సూచించారు. ఇకపోతే మెగా కృష్ణారెడ్డి ఇంటి మీదకు ఏసీబీని పంపే దమ్ముందా..? అని సీఎం రేవంత్ రెడ్డికి కేటీఆర్ సవాల్ విసిరారు. నీవు మొగోనివే అయితే మెగా కృష్ణారెడ్డి కంపెనీని బ్లాక్ లిస్ట్‌లో పెట్టి కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. నన్ను ఏసీబీ విచారిస్తుందట.. ఏసీబీ ఫుల్ ఫామ్ తెలుసా రేవంత్ రెడ్డికి.. తెలుసనుకో.. బ్యాగులతో తిరిగినోడికి ఎందుకు తెల్వదు. ఏసీబీ అంటే యాంటీ కరప్షన్ బ్యూరో. ఏసీబీని కరప్షన్‌కు వ్యతిరేకంగా వాడాలి. ఇందులో కరప్షన్ ఏడుంది.. కాకరకాయ ఏడుంది. నేను అడుగుతున్నా చెప్పు. ఫార్ములా-ఈ రేస్ హైదరాబాద్‌లో ఉండాలని చెప్పి హెచ్ఎండీఏ నుంచి రూ. 55 కోట్లు పంపిన మాట వాస్తవం. దాంట్ల నేను ఏమైనా దాచుకుంటినా..? నాకు ఏమైనా వచ్చాయ..? అని కేటీఆర్ ప్రశ్నించారు. ఈ రేస్ రద్దుతో హైదరాబాద్‌కు నష్టం కలిగించినా రేవంత్ రెడ్డి మీద కేసు పెట్టాలి. హైదరాబాద్ ఇమేజ్ దెబ్బ తీశావు. రేవంత్ రెడ్డిది తెలివితక్కువ నిర్ణయం. ఆగస్టు 25న నరికిందు రేవంత్ రెడ్డి.. 2036 ఒలిపింక్స్‌ను ఇక్కడికి తెస్తడట. ఎంత ఖర్చు అయితదో తెలుసా ఈ సీఎంకు. 2016 ఒలిపింక్స్‌కు రియోలో లక్షా 8 వేల కోట్లు, 2020లో టోక్యోలో 2.9 లక్షల కోట్లు ఖర్చు పెట్టారు. ఈ ఖర్చు మన బడ్జెట్ అంత. ఈ మొగోడు ఒలింపిక్స్ హైదరాబాద్‌లో పెడుతాడట. 50 కోట్లకే ఒర్రుతుండు. నీ ముఖానికి అయితదా..? అంతర్జాతీయ ప్రమాణాతో ఈవెంట్ నిర్వహించడం తెలుసా..? అని కేటీఆర్ నిప్పులు చెరిగారు. చేతనైతే మెగా ఇంజినీరింగ్ మీద పెట్టు కేసు. సుంకిశాలలో గోడ కూలిపోయింది 80 కోట్లు నష్టం వచ్చింది. దమ్ముంటే బ్లాక్ లిస్ట్‌లో పెట్టి మెగా కృష్ణారెడ్డి ఇంటి మీదికి ఏసీబీని పంపు.. ఈస్టిండియా కంపెనీ అన్నావు కదా..? నీవు మొగోనివి అయితే పంపు.. ఏసీబీ కేసు పెట్టు. అవసరమైతే 50 లక్షలతో దొరికిన బ్యాగ్‌మెన్ మీద ఏసీబీ కేసు పెట్టాలి. ఇవాళ రేస్ రద్దు చేయడం కారణంగా జరిగిన నష్టానికి రేవంత్ మీద ఏసీబీ కేసు పెట్టాలి.



# తెలంగాణలో పలువురు డీఎస్పీల బదిలీ




**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** తెలంగాణలో పలువురు డీఎస్పీ అధికారులు బదిలీ అయ్యారు. ఈ మేరకు డీజీపీ ఇవాళ (గురువారం) ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం వెయిటింగ్‌లో ఉన్న అధికారి ఎస్ఆర్ దామోదర్ రెడ్డిని అంబర్‌పేట్ డీఎస్పీ, పీటీసీగా బదిలీ చేశారు. ప్రస్తుతం జగిత్యాల డీఎస్పీ, డీసీఆర్‌బీగా ఉన్న జీ మహేశ్ బాబుని కరీంనగర్ డీఎస్పీ, పీటీసీగా బదిలీ చేశారు. ఇక కరీంనగర్ డీఎస్పీ, పీటీసీగా ఉన్న బీ.రామానుజంను కాగజ్‌నగర్ ఎస్‌డీపీవోగా ట్రాన్స్‌ఫర్ చేశారు. కాగజ్‌నగర్ ఎస్‌డీపీవోగా ఉన్న ఏ.కరుణాకర్‌ను అసిఫాబాద్ ఎస్‌డీపీవోగా బదిలీ చేశారు. అసిఫాబాద్ ఎస్‌డీపీవోగా ఉన్న పీ.సదయ్యను బదిలీపై హైదరాబాద్‌లోని చీఫ్ ఆఫీస్‌లో రిపోర్ట్ చేయాలని డీజీపీ కోరారు. ప్రస్తుతం వనపర్తి డీఎస్పీ, డీసీఆర్‌బీగా ఉన్న కే.క్రిష్ణ కిశోర్‌ను తొర్రూర్ (మహబుబాబాద్) ఎస్‌డీపీవోగా బదిలీ చేశారు. ఇక తొర్రూర్ ఎస్‌డీపీవోగా ఉన్న వీ సురేశ్‌ను హైదరాబాద్‌లోని చీఫ్ ఆఫీస్‌లో రిపోర్ట్ చేయాలని ఆదేశించారు. నిర్మల్ డీఎస్పీ, డీసీఆర్‌బీగా ఉన్న పీ.రవీందర్ రెడ్డిని ఖమ్మం ఏసీపీ, సీసీఆర్‌బీగా బదిలీ చేశారు. ఖమ్మం ఏసీపీ, సీసీఆర్‌బీగా ఉన్న డీ.ప్రసన్న కుమార్‌ను మెదక్ ఎస్‌డీపీవోగా ట్రాన్స్‌ఫర్ చేశారు. ఈ మేరకు సంబంధిత అధికారులకు డీజీపీ ఉత్వర్వులు జారీ చేశారు. కొత్త పోస్టింగ్ ప్రదేశాల్లో తక్షణమే రిపోర్ట్ చేయాలని స్పష్టం చేశారు.

# రాజన్న సిరిసిల్లలో అమానవీయ ఘటన

### దబ్బులు విషయంలో మేస్త్రీ తల్లిని తీసుకెళ్లిన కాంట్రాక్టర్

### పోలీసులకు ఫిర్యాదు...కేసు నమోదు



**రాజన్న సిరిసిల్ల, (క్రైమ్ మిర్రర్):** తీసుకున్న డబ్బులు చెల్లించని కారణంగా ఓ మేస్త్రీ తల్లిని కాంట్రాక్టర్ తీసుకెళ్లిన అమానవీయ సంఘటన రాజన్న సిరిసిల్ల జిల్లాలో చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసుల వివరాల ప్రకారం... వేములవాడ అర్బన్ మండలం కొడుముంజ గ్రామానికి చెందిన పల్లపు శ్రీను అనే వ్యక్తి బండ పని మేస్త్రీగా పనిచేస్తున్నాడు. కాగా, మహారాష్ట్రకు చెందిన లాలు దేవకర్ అండ్ టీం కర్ణాటకలో చెరుకు తోటలను కోసే పనులను కాంట్రాక్టు తీసుకున్నారు. ఇందుకోసం కూలీలు అవసరం ఉండగా.. శ్రీను, అతడి సోదరుడిని సంప్రదించారు. ప్రస్తుతం శ్రీను, అతని సోదరుడు ఛత్తీస్‌గఢ్‌లో కూలీ పనులు చేస్తున్నారు. అయితే లాలు దేవకర్‌కు సంబంధించి కర్ణాటకలోని చెరుకు తోట కొట్టడానికి కావాల్సిన కూలీల కోసం ఛత్తీస్‌గఢ్‌కు చెందిన కూలీలతో శ్రీను ఒప్పందం కుదిర్చాడు. దీనికి మధ్య వర్తిత్వంగా శ్రీను వ్యవహరించాడు. ఇందుకోసం లాలు దేవకర్ రూ.3.80 లక్షలను కూలీలకు చెల్లించాడు. అయితే కూలీలు పనులకు రాకపోవడంతో లాలు దేవకర్‌కు, కొడుముంజకు చెందిన శ్రీను, అతడి సోదరునికి మధ్య వివాదం చోటుచేసుకుంది. తన డబ్బులు తిరిగి చెల్లించాలని లాలు దేవకర్ శ్రీను అతడి సోదరుడిపై ఒత్తిడి చేశాడు. ఈ విషయంలో పలుమార్లు చర్చలు జరిగాయి. ఈ క్రమంలో లాలు దేవకర్, మరికొంత మంది కొడుముంజ ఆర్అండ్ఆర్ కాలనీలోని శ్రీను ఇంటికి వచ్చి ఇంట్లో ఉన్న శ్రీను తల్లి పల్లపు భీమా బాయిని బలవంతంగా కారులోకి ఎక్కించి కిడ్నాప్‌కు పాల్పడ్డారు. డబ్బులిచ్చి తల్లిని తీసుకెళ్లాలంటూ అక్కడి నుంచి వెళ్లిపోయారు. బాధిత కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# అత్తాపూర్‌లో సీపీ అవినాష్ మహంతి ఆకస్మిక తనిఖీ



**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** అత్తాపూర్ పోలీస్ స్టేషన్‌లో సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి ఆకస్మిక తనిఖీ చేపట్టారు. స్టేషన్‌లోని ఫైల్స్‌ను పరిశీలించారు. పెండింగ్ కేసులపై ఆరా తీశారు. డ్రగ్స్, గంజాయి విక్రయాలపై సీరియస్‌గా దృష్టిపెట్టాలని, కమిషనరేట్ పరిధిలో ఇదే అత్యంత సీరియస్ సమస్యగా మారుతోందదన్నారు. అందరూ సీరియస్‌గా పనిచేయాలని, అనుమానిత ప్రాంతాలు, వ్యక్తులపై నిఘా వేసి ఉంచాలని పోలీసులను ఆదేశించారు. కేసుల దర్యాప్తు ఎట్టి పరిస్థితుల్లోనూ పెండింగ్‌లో ఉండొద్దన్నారు. ఏదైనా సమస్య ఉంటే నేరుగా తనకు వివరించాలని ఆదేశించారు.

# ఏసీబీకి చిక్కిన మహబూబ్‌నగర్ డీఈవో

### రూ. 50 వేలు లంచం తీసుకుంటు రెడ్‌హ్యాండెండ్‌గా పట్టుబడ్డ రవీందర్



**మహబూబ్‌నగర్,(క్రైమ్ మిర్రర్):** ఓ ఉపాధ్యాయుడి నుంచి లంచం తీసుకుంటూ మహబూబ్‌నగర్ డీఈవో రవీందర్ గురువారం ఏసీబీకి పట్టుబడ్డాడు. వివరాల్లోకి వెళ్తే.. ఉపాధ్యాయుడికి దక్కాల్సిన సీనియారిటీ దక్కకపోవడంతో తనకు న్యాయం చేయాలని పలుమార్లు డీఈఓకు విజ్ఞప్తి చేశాడు. డీఈవో రూ.50,000 లంచం డిమాండ్ చేశాడు. దీంతో సదరు ఉపాధ్యాయుడు ఏసీబీ డీఎస్పీ కృష్ణ గౌడ్‌ను ఆశ్రయించాడు. ఏసీబీ అధికారుల సూచన మేరకు గురువారం ఉదయం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని శ్రీనివాస కాలనీలో ఉన్న డీఈవో ఇంటికి వెళ్లి 50 వేల రూపాయలు ఇస్తుండగా డీఎస్పీ కృష్ణ గౌడ్ బృందం డీఈఓను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం రూ.50 వేలు స్వాధీనం చేసుకొని విచారణ చేపట్టారు.

# కేసీఆర్ ఆనవాళ్లను చెరిపేసే ప్రయత్నం

## విద్యార్థుల జీవితాలతో సీఎం రేవంత్ చెలగాటం : కేటీఆర్

**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** కేసీఆర్ ఆనవాళ్లను చెరిపేసే ప్రయత్నంలో విద్యార్థుల ప్రాణాలతో రేవంత్ సర్కార్ చెలగాటమాడుతున్నదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. కేసీఆర్‌పై కక్షగట్టి గురుకుల, ఆశ్రమ పాఠశాల విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమా అని ప్రశ్నించారు. వరుసగా ఫుడ్ పాయిజన్ ఘటనలు చోటు చేసుకుంటున్నా సర్కార్ ఏం చేస్తున్నదని నిలదీశారు. విద్యార్థుల అవస్థలు రేవంత్ రెడ్డి కంటికి కనిపించడం లేదా అని, నిమ్స్ లో పేద పిల్లల హాహాకారాలు వినిపించడం లేదా మండిపడ్డారు. పది రోజులుగా ఫుడ్ పాయిజన్ ఘటనలు నిత్యకృత్యమై పేదల పిల్లలు గోడుగోడునా ఏడుస్తుంటే కనీసం సమీక్ష అయినా నిర్వహించావా అని ముఖ్యమంత్రిని ప్రశ్నించారు. విద్యాశాఖను అంటిపెట్టుకొని 11 నెలల్లో మీరు పీకిందేమిటని మండిపడ్డారు. ఫుడ్ పాయిజన్‌తో విద్యార్థులను అవస్థలకు గురిచేశారన్నారు. గురుకులాలకు తాళం పడేలా చేశారని, ప్రాథమిక పాఠశాలలకు శీతాకాలంలోనే ఒంటిపూట పెట్టారని దుయ్యబట్టారు. సకల జనులను కాంగ్రెస్ పార్టీ కన్నీళ్లుపెట్టిస్తున్నదని విమర్శించారు. మార్పుకు ఓటేసిన ఫలితం తెలంగాణను వెంటాడుతున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు.



**పలికిమాలిన పాలనలో పల్లె, పట్టణ ప్రగతి లేదు : కేటీఆర్**

కేసీఆర్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన పల్లె, పట్టణ ప్రగతి కార్యక్రమంతో రాష్ట్రంలోని పల్లెలు, పట్టణాల రూపురేఖలు మారిపోయాయి. తెలంగాణ తొలి పాలకుడి ఆశయాలను రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ సర్కార్ నీరుగార్చడంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. ఈ పనికిమాలిన పాలనలో పల్లె ప్రగతి లేదు.. పట్టణ ప్రగతి లేదని విమర్శించారు. ముందుచూపు లేని ముఖ్యమంత్రితో రాష్ట్రానికే అతీగతీ లేదని దుయ్యబట్టారు. 'పల్లె ప్రగతి' వల్ల మొన్నటి దాకా మురిసిన పల్లెలు.. నేడు మురికి కూపాలను తలపిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణ ప్రగతితో పరుగులు తీసిన పట్టణాలు, నేడు సమస్యలకు నిలయాలుగా మారుతున్నాయని ఫైరయ్యారు. ఒకప్పుడు పల్లె కన్నీరు పెడుతుంది అని పాడుకున్నాం.. ఇప్పుడు పట్టణాలు విలవిలలాడుతున్నాయని బాధపడే దుస్థితి దాపురించిందని విమర్శించారు. ఈ మార్పు మాకొద్దు అనే నినాదం మొదలైందని, కాంగ్రెస్‌ను కూకటివేళ్లతో పెకిలించే రోజు దగ్గరపడిందని ఎక్స్ వేదికగా చెప్పారు.




# రేవంత్ రెడ్డి ఒకే ఒక్కడు

### పుస్తకాన్ని ఆవిష్కరించిన పిసిసి చీఫ్

**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** సీఎం రేవంత్ రెడ్డి పై రాసిన ఒకే ఒక్కడు పుస్తకాన్ని పీసీసీ అధ్యక్షుడు మహేష్ కూమార్ గౌడ్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విలక్షణమైన నాయకుడు రేవంత్ రెడ్డి అన్నారు. చిన్న వయసులో రాజకీయాల్లో డైనమిక్ లీడర్ గా ఎదిగిన వ్యక్తీ రేవంత్ రెడ్డి అని తెలిపారు. ప్రజాస్వామ్యాన్ని తుంగలో తొక్కి, నిర్బంధాలతో పాలన చేస్తున్న కేసీఆర్ పైన పోరాటం చేసిన వ్యక్తి రేవంత్ రెడ్డి అని వ్యాఖ్యానించారు. రేవంత్ రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా ఒకే ఒక్కడు పుస్తక ఆవిష్కరణ చేసుకున్నామని తెలిపారు. ఒకే ఒక్కడు పుస్తకాన్ని రచించిన వేణుగోపాల్ రెడ్డి, విజయార్కేకు అభినందనలు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ కమిటి నుంచి ముందుగా రేవంత్ రెడ్డికీ పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. రేవంత్ రెడ్డి నిండు నూరేళ్ళు ఆయురారోగ్యాలతో సంతోషంగా ఉండాలని .. ఎక్కువ కాలం రాజకీయాల్లో ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని తెలిపారు. ఇదిలా ఉండగా.. రేపు (శుక్రవారం) ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఎన్నో కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు.

# అప్పు ఆ కుటుంబం పాలిట శాపమైంది

### వేధింపులు తాళలేక గోదావరిలో దూకి తండ్రి, కూతురు మృతి



**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** చేసిన అప్పు ఓ కుటుంబం పాలిట శాపంగా మారింది. అప్పుల వాళ్ల వేధింపులు భరించలేక ఆత్మహత్యకు పాల్పడింది. ఈ విషాదకర సంఘటన నిజామాబాద్ జిల్లాలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే..నిజామాబాద్ న్యాల్ కల్ రోడ్డులో నివాసం ఉండే వేణు(50) చిరు వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఆయనకు భార్య అనురాధ, కూతురు పూర్ణిమ (24) ఉన్నారు. కాగా, వ్యాపార నిమిత్తం స్థానిక వడ్డీ వ్యాపారులు రోషన్, వికాస్ వద్ద రెండేళ్ల కింద రూ.3 లక్షల అప్పు తీసుకున్న వేణు మొత్తానికి వడ్డీతో సహా అసలు చాలావరకు కట్టాడు. అయినా వడ్డీ, చక్రవడ్డీల కింద జమ చేసి ఇంకా అప్పు కట్టాలని లేదంటే భార్యాకూతుళ్లను అందరిలో వివస్త్రలను చేస్తామని బెదిరించారు. దీంతో వడ్డీ వ్యాపారస్తుల వేధింపులు తట్టుకోలేక వేణు కుటుంబం బాసర వద్ద గోదావరిలో దూకారు. గమనించిన స్థానిక జాలరులు అనురాధను అతి కష్టం మీద కాపాడారు. వేణు మృతదేహం లభించింది. కూతురు పూర్ణిమ మృతదేహం కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

# కుటుంబ సర్వేను విజయవంతం చేయండి

### చిత్తశుద్ధితో కృషి చేయాలని అధికారులకు సిఎస్ ఆదేశం

**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను విజయవంతంగా పూర్తి చేసేందుకు చిత్త శుద్ధితో కృషిచేయాలని అధికారులను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఆదేశించారు. రాష్ట్రంలో జరుగుతున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే నిర్వహణపై గురువారం ప్రత్యేకాధికారులతో టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సీఎస్ సమీక్షించారు. ప్రణాళికా శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ సుల్తానియా కూడా పాల్గొన్న ఈ టెలీ కాన్ఫరెన్స్‌లో సీఎస్ శాంతి కుమారి మాట్లాడుతూ.. ఈ సర్వేకు సంబంధించి ఇంటింటి వివరాలను సేకరించి స్టిక్కరింగ్ చేసే పక్రియ రేపటితో పూర్తవుతుందని, ఈ నెల 9 నుండి అసలు సర్వే మొదలవుతుందన్నారు. ఉమ్మడి జిల్లాలకు నియమితులైన ప్రత్యేకాధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి సర్వే జరుగుతున్న విధానాన్ని ప్రత్యక్షంగా పరిశీలించడంతో పాటు జిల్లా కలెక్టర్లు, సర్వే నోడల్ అధికారులతో సమీక్ష సమావేశాలు నిర్వహించాలని స్పష్టం చేశారు. సేకరించిన వివరాలను కంప్యూటరైజ్ చేయడానికి సుశిక్షితులైన డాటా ఎంట్రీ ఆపరేటర్లను నియమించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. దేశంలోనే ప్రథమంగా చేపట్టిన ఈ ఇంటింటి కుటుంబ సర్వే పక్రియని రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యవేక్షిస్తున్నారని వెల్లడించారు. ఈ సర్వేలో ప్రతీ ఒక్క కుటుంబం పాల్గొనేలా ప్రతీ రోజూ ప్రజలను చైతన్యపర్చేలా విస్తృత ప్రచారం చేపట్టాలని తెలిపారు. ఏ ఇంటిని కూడా వదలకుండా పకడ్బందీగా నిర్వహించాలన్నారు.




# నగరంలో తళుక్కుమన్న జాన్వీకపూర్

### మధురానగర్ హనుమాన్ ఆలయంలో పూజలు

**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** దేవర బ్యూటీ జాన్వీ కపూర్ నగరంలో తళుక్కున మెరిసింది. అతి తక్కువ కాలంలోనే తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. ఓవైపు గ్లామరస్ పాత్రలు పోషిస్తూనే మరోవైపు లేడీ ఓరియెంటెడ్ సినిమాల్లో మెరిసింది. ఇక ఇటీవలే యంగ్ టైగర్ ఎన్టీఆర్ దేవర సినిమాతో తెలుగు ఆడియెన్స్ ను పలకరించింది జాన్వీ. సినిమాల సంగతి పక్కన పెడితే జాన్వీకి భక్తి ఎక్కువే. అందుకే తన తల్లి పుట్టిన రోజు, అలాగే తన బర్త్ డే రోజున తప్పకుండా తిరుమల శ్రీవారి దర్శనం చేసుకుంటుంది. ఇక ప్రస్తుతం రామ్ చరణ్ సినిమా కోసం ఎక్కువగా హైదరాబాద్ లోనే ఉంటోంది జూనియర్ శ్రీదేవి. షూటింగ్ నుంచి కాస్త విరామం, తీరికదొరికినప్పుడల్లా సిటీలోని గుళ్లను తిరగేస్తోందీ అందాల తార. తాజాగా హైదరాబాద్ హనుమాన్ టెంపుల్‌లోనూ ప్రత్యేక పూజలు చేసింది జాన్వీ.తాజాగా గురువారం అమీర్ పేట దగ్గరలోని మధురానగర్ ఆంజనేయస్వామి ఆలయానికి వచ్చింది జాన్వీ కపూర్. సుమారు అరగంట పాటు ప్రత్యేక పూజలు నిర్వహించింది. అనంతరం ఈమెకు అర్చకులు తీర్థప్రసాదాలు అందించారు. జాన్వీ వచ్చిందని తెలిసి, గుడి దగ్గరకు పెద్ద ఎత్తున అభిమానులు చేరుకున్నారు. ఆమెతో సెల్ఫీలు దిగేందుకు పోటీ పడ్డారు.

## ఎడిటోరియల్



# మోడీ పదేళ్ల పాలనలో ఆర్థికాభివృద్ధి డొల్ల

ఆర్థికాభివృద్ధిలో భారతదేశం ఏడు శాతం వృద్ధితో ప్రపంచంలోనే అగ్రగామిగా ఉందని మోడీ ప్రభుత్వం గొప్పలు చెప్పుకొంటున్నా ..90 శాతం మంది ప్రజలకు దీని ప్రయోజనాలు అందడం లేదన్నది కఠోర వాస్తవం. ప్రజలు ఎదుర్కొంటున్న అసలైన ధరల పెరుగుదల ప్రభుత్వ గణాంకాలకు అందనంతగా ఉందన్నది మరో వాస్తవం. భారత ఆర్థిక వ్యవస్థ తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటోందని వివిధ ప్రభుత్వ శాఖలు ఇటీవల విడుదల చేసిన వివిధ గణాంకాలు విదితం జేస్తున్నాయి. రూపాయి విలువ క్షీణించడం, పెరుగుతున్న ద్రవ్యోల్బణం, స్టాక్ మార్కెట్ నుండి విదేశీ పెట్టుబడుల ఉపసంహరణ, విపరీతమైన విదేశీ రుణాలు, విదేశీ వాణిజ్యలోటు వంటివి మన ఆర్థిక వ్యవస్థ దుస్థితిని వెల్లడించడమే కాదు.. క్షీణతను సూచిస్తున్నాయి. అమెరికా డాలర్‌తో పోలిస్తే రూపాయి అత్యధికంగా నష్టపోయింది. డాలర్ విలువ రూ.84.07 పైసలు. ఆ మారకపు విలువను కొనసాగించేందుకు రిజర్వ్ బ్యాంక్ తన నిల్వల నుంచి పెద్ద

మొత్తంలో డాలర్లను విడుదల చేస్తోంది. ఇది విదేశీ మారక నిల్వలను కూడా తగ్గిస్తుంది. మోడీ ప్రభుత్వం 2014 మేలో అధికారంలోకి వచ్చినప్పుడు డాలర్ మారకం విలువ రూ.59.44 పైసలు కాగా పదేళ్లలో దాదాపు రూ.25 పడిపోయి రూ.84కి దిగజారింది. విదేశీ వాణిజ్య లోటు కూడా పెరుగుతోంది. ఆగస్టులో వాణిజ్య లోటు 2,970 డాలర్లకు పెరిగింది. గతేడాది ఆగస్టులో ఇది 2,421 కోట్లు. భారతదేశ ఎగుమతులు చాలా బలహీన స్థితిలో ఉన్నాయి. పెరుగుతున్న ద్రవ్యోల్బణం ప్రజల కొనుగోలు శక్తిని కూడా తగ్గిస్తుంది.

భారత ఆర్థిక వ్యవస్థ స్థిరత్వంపై విదేశీ పెట్టుబడిదారులు విశ్వాసం కోల్పోయారు. విదేశీ మదుపరులు తమ పెట్టుబడులను భారతీయ స్టాక్ మార్కెట్ నుంచి ఉపసంహరించు కుంటున్నారు. విదేశీ మదుపరులు ఈ నెలలో ఇప్పటివరకు రూ.85,000 కోట్ల విలువైన షేర్లను విక్రయించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండవ త్రైమాసికంలో, భారతీయ కంపెనీల ఆర్థిక పరిస్థితి బలహీనంగా ఉండడంతో విదేశీ పెట్టుబడిదారులు దూరమవుతున్నారు. ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసేందుకు చైనా ఉద్దీపన ప్యాకేజీని ప్రకటించడం భారత మార్కెట్‌ను కూడా తాకింది. ప్రపంచ ఆర్థిక మాంద్యం కారణంగా 2008లో భారతీయ స్టాక్ మార్కెట్ నుండి విదేశీ పెట్టుబడులు ఉపసంహరించబడ్డాయి. అప్పట్లో అది పెద్ద ప్రభావం చూపింది. రూపాయి విలువ క్షీణతకు అది కూడా కారణమైంది. సెప్టెంబర్‌లో వస్తు, సేవల పన్ను వసూళ్లే ఇందుకు నిదర్శనం. 40 నెలల్లో అత్యల్ప వృద్ధి రేటు (–) 6.5 శాతం నమోదైంది. ప్రస్తుత ద్రవ్యోల్బణం రేటుతో పోలిస్తే సెప్టెంబర్‌లో జిఎస్‌టి ఆదాయం పెద్దగా పెరగలేదు. బొగ్గు, విద్యుత్, ముడి చమురు ప్రాసెసింగ్, మైనింగ్ వంటి ఎనిమిది కీలక రంగాల్లో ఉత్పత్తిపై ఆధారపడిన పారిశ్రామికోత్పత్తి సూచీ ఆగస్టులో ప్రతికూల వృద్ధిని నమోదు చేసింది. గత ఏడాదితో పోలిస్తే సెప్టెంబర్‌లో కార్ల విక్రయాలు 19 శాతం తగ్గాయి. సేవల రంగ సూచీ కూడా 10 నెలల కనిష్టానికి చేరింది. ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో గృహ రుణాల పంపిణీ తొమ్మిది శాతం పడిపోయింది. బలమైన మరియు చలనశీలమైన ఆర్థిక వ్యవస్థకు అవసరమైన ఇటువంటి అంశాలు క్షీణిస్తున్నాయి. పేలవమైన ఆర్థిక విధానాల ఫలితంగా మధ్యతరగతి, దిగువ తరగతులవారి ఆదాయం తగ్గింది. దేశం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య కొనుగోలు శక్తి లేకపోవడం. కొనుగోలు శక్తి కోవిడ్ పూర్వ స్థాయికి చేరుకోలేదని చాలా సూచికలు చూపిస్తున్నాయి. కొనుగోలు శక్తిని పెంచుకోవాలంటే దిగువన ఉన్న 50 శాతం మంది చేతిలో ఎక్కువ డబ్బు రావాలి. కానీ కేంద్ర ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం, ఇతర సంక్షేమ పథకాల కేటాయింపులు పెంచడం లేదు. దానికి బదులుగా, కార్పొరేట్ లకు పన్ను మినహాయింపులతో సహా భారీ సబ్సిడీలు ఇస్తోంది. మాంద్యం నుంచి ఆర్థిక వ్యవస్థను కాపాడేందుకు ప్రత్యేక ప్యాకేజీలను అమలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధం కావాలి. పెరుగుతున్న నిరుద్యోగం, వేతన పెరుగుదల లేకపోవడం ప్రజల కొనుగోలు శక్తిని క్షీణింపజేసింది. ఏడు శాతం వృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థ స్తబ్దుగా ఉందనడానికి ఇంతకన్నానిదర్శనం అక్కర్లేదు. .

# కుదిపేస్తున్న ధరల దాడి..ద్రవ్యోల్బణం !

**దేశంలో ద్రవ్యోల్బణ పరిస్థితులను నివారించడంలో పటిష్టమైన చర్యలు తీసుకోవడం లేదు. రూపాయి మారకం విలువ నానాటికి దిగజారుతోంది. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం 84 రూపాయలు దాటింది. ధరలు స్వారీ చేస్తున్నాయి. ప్రధానంగా బియ్యం,ఉప్పు,పప్పుల ధరలు విపరీతంగా పెరుగుతున్నా అజమాయిషీ చేయడంలేదు. ధరలను కంట్రోల్ చేయడం తమ పని కాదన్న రీతిలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఉన్నాయి. ధరలను అదుపు చేసే యంత్రాంగం లేకుండా పోయింది. పాలకులకు ఇది పని కాదన్నట్లుగా వ్యవహరిస్తున్నారు.**



మరీ ముఖ్యంగా మోడీ పాలనలో గత పదేళ్లుగా అన్నిరకాల వస్తువుల ధరలు, మందుల ధరలు దాడి చేస్తున్నా పట్టించుకోవడం లేదు. జిఎస్టీ గురించి సమీక్షించకుండా నిరంకుశం గా వ్యవహరిస్తున్నారు. దీనికితోడు నిత్యావసర ధరలతో పాటు, నిత్యం వాడే మందుల ధరలు కూడా ఇబ్బడి ముబ్బడిగా పెరిగాయి. ఇవన్నీ వాటంతట అవే పెరుగుతున్నాయని అనుకోవడానికి లేదు. అయినా నియంత్రించే వ్యవస్థ లేకుండా పోయింది. వ్యాపారులపై అజమాయిషీ లేకపోవడంతో ధరలతో దాడి చేస్తున్నారు. పేదవాడు మరింత పేద వాడుగా, ధనవంతులు మరింత ధనవంతులగా మారుతున్నారు. పేదరిక నిర్మూలన గురించి మాట్లాడుతున్న మోడీ సర్కార్ ఈ పరిస్థితులను సమీక్షించడం లేదు. ఎక్కడ పేదరికం పోయిందో చెప్పడం లేదు. పేదరికం పోతే పేదలకు ఉచిత బియ్యం పంపిణీ ఎందుకు చేస్తున్నారో చెప్పడం లేదు. వ్యవసాయోత్పత్తులను పెంచి, రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించడం ద్వారా దేశంలోని పేదలకు అన్నం పెట్టాలన్న ప్రణాళికలకు అడుగులు పడడం లేదు. సహజంగానే వ్యవసాయిక దేశమైన భారత్‌లో ఉన్న నేలలు అన్ని పంటలకు అనువుగా ఉన్నాయి. సహజవనరులు కూడా ఉన్నాయి. పరిమితంగా ఉన్న వనరులను సమర్థవంతంగా ఉపయోగించడం వంటి విధానాలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పాటించట్లేదు. పథకాల పేరుతో పంచడం తప్ప, ఆదాయం పెంచే మార్గాలను అన్వేషించడం లేదు. నీటి వనరులను సద్వినయోగం చేసే దిశగా సాగడం లేదు. వ్యవసాయోత్పత్తులు పెరుగుతున్నా వాటిని ప్రజలకు చేరవేయడంలో ప్రభుత్వాలు విఫలం అవుతున్నాయి. అలాగే వ్యవసాయ అనుబంధ రంగాలను ప్రోత్సహించి..వేదేశీ మారక ద్రవ్యం సంపాదించేలా ప్రణాళికలు లేకుండా పోయాయి. వ్యవసాయ అభివృద్ధి, పరిశ్రమల అభివృద్ధి కుంటుపడటమే ధరలు నానాటికీ పెరగడానికి కారణంగా చూడాలి. ఇబ్బడిముబ్బడిగా ఉచిత పథకాలు, డబ్బుల పందేరంతో ప్రజలను సోమరులుగా తయారు చేస్తున్నారు. అన్నింటికీ ప్రభుత్వాలపై ఆధారపడేలా చేస్తున్నారు. పేదరికానికి మూలం ప్రభుత్వ విధానాలే అన్నది గుర్తించడం లేదు. ప్రజలను దేశ ఉత్పత్తిలో భాగస్వాములుగా చేయడం అన్నది పక్కన పెట్టేశారు. ప్రజలను చైతన్యవంతులుగా, విజ్ఞానవంతులుగా, ఆలోచనా పరులుగా, అవగాహనాపరులుగా చేస్తే తమకు ముప్పు అన్న ఆలోచనలో రాజకీయ పార్టీల నేతలు, పాలకులు ఉన్నారు. భారతదేశంలో ఆర్థిక, సామాజిక, రంగాల అభివృద్ధి జరుగుతుందని అనుకుంటున్నా అది ఎంతన్నది ...మన ఆర్థికాభివృద్ధిని లెక్కలేసుకుంటే కొంతేనని తేలుతుంది. భారతదేశ ఆర్థిక వ్యవస్థ నానాటికీ దిగజారి చివరకు ఎటుదారితీస్తుందోఅన్న భయం కలుగుతోంది. దారిద్ర్య సూచికలో భారతదేశం 107వ స్థానానికి పడిపోయింది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో దేశ స్థితిని దారిద్ర్యం వైపు, దివాళాకోరుతనం వైపు చూడడానికి ఒక అవకాశం కలిగింది. ఈ విధంగా భారతదేశం దిగజారిపోవడానికి కారణం పాలకవర్గం తీసుకుంటున్న తిరోగమన చర్యలే అని చెప్పక తప్పదు. కార్పొరేట్ శక్తులు, బ్యాంకులకు డబ్బులు ఎగవేసిన వాళ్ళు, అవినీతి అధికారులు, దోపిడీని కొనసాగిస్తున్న రాజకీయ నాయకులే అత్యధికం. భారతదేశం ఎందుకు ఆర్థికంగా సంక్షోభంలో వుందని పరిశీలిస్తే పాలకుల తిరోగమన విధానాలు కారణంగా చెప్పుకోవాలి. వ్యవసాయ పశు గుణాభివృద్ధి ద్వారా భారతదేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసే అవకాశాలను ఎవరు కూడా పట్టించుకోవడం లేదు. గ్రామీణ అర్థిక వ్యవస్థకు ఊతంగా ఉండే వ్యవసాయ రంగాన్ని,పాడి పరిశ్రమను శాస్త్రీయంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వాలు కృషి చేయడం లేదు. రైతులను, రైతు కూలీలను నిరంతరం సంక్షోభంలో ముంచుతున్నారు. దేశంలో వ్యవసాయ భూమి విస్తరించట్లేదు. పేద ప్రజలకు భూములు ఇవ్వడంలేదు. పాలకవర్గాలు వీటన్నింటినీ విస్మరించడం వల్లే ఈ రోజున పేదరికం పెరిగిపోతోంది. వ్యవసాయాన్ని అభివృద్ధి చేసే వివిధ ప్రణాళికలు కేవలం కాగితాలకే పరిమితం అయ్యాయి. వ్యవసాయ రంగంలో అధిక ఉత్పత్తి సాధించడం, ఆహార వస్తువుల ధరలస్థిరీకరణ సాధించడం,పేద ప్రజలకు ఆహార భద్రత కలిగించడం, వ్యవసాయదారులు, వినియోగదారుల ప్రయోజనాల మధ్య సమతూకం సాధించడం వంటివి ముందుకు సాగడం లేదు. ముఖ్యంగా సంస్కరణలు వృద్ధిరేటును పెంచినప్పటికి నిరుద్యోగ నిర్మూలనకు పెద్దగా తోడ్పడలేదు. ముఖ్యంగా సంఘటిత రంగంలో ఉపాధి తగ్గిపోతున్నది. రెగ్యులర్ ఎంప్లాయీస్ తగ్గుతూ క్యాజువల్ లేబర్ పెరుగుతున్నారు. క్యాజువల్ లేబర్‌ను, ప్రభుత్వ ఉద్యోగులను రెగ్యులర్ ఉద్యోగులుగా మార్చకపోవడం వలన వారు అభద్రతలో వున్నారు.సమగ్రాభివృద్ధి చెందాలి అంటే పారిశ్రామిక అభివృద్ధి ద్వారానే సాధ్యమని గుర్తించి ముందుకు సాగాలి. వ్యవసాయఅభివృద్ధికి చర్యలు తీసుకోవాలి. విప్లవాత్మక చర్యలకు పూను కోవాలి. అలాగే పాడి రంగాన్ని, కోళ్ల పరిశ్రమల అభివృద్ధి తదితర రంగాలను ప్రోత్సహించాల్సి ఉంది. దేశంలో ఉత్పత్తి రంగాల్లో మాంద్యం పెరిగింది.పారిశ్రామికాభివృద్ధి పూర్తిగా పడకేసింది. పెట్టుబడులు లేవు, పరిశ్రమలు లేవు, ఉపాధి కల్పన లేదు. మరోవైపు పెద్దఎత్తున ఉద్యోగాలు పోయాయి. ప్రభుత్వ ఉద్యోగాల్లో ఖాళీలను భర్తీ చేసిన పాపాన పోలేదు. విద్యాధికులైన యువతకు సంపాదనా మార్గాలను పూర్తిగా మూసేశారు. మరీ ముఖ్యంగా బడుగు, బలహీనవర్గాల ఆర్థికస్థితిని చావుదెబ్బ తీశారు. వాళ్ల భవిష్యత్తును అనిశ్చితిలోకి నెట్టారు. ఇవన్నీ దృష్టిలో పెట్టుకుని ముందుకు సాగితే తప్ప మన ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసుకోలేం.

## అరబిందోకు జగన్ దోచిపెట్టారు

**ప్రజల ప్రాణాలతో చెగాటంఆడిన అరబిందో**

**టిడిపి సీనియర్ నేత సోమిరెడ్డి ఘాటు విమర్శలు**

అమరావతి: అంబులెన్సుల నిర్వహణలో అరబిందో భారీ కుంభకోణానికి పాల్పడిందని తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి వ్యాఖ్యలు చేశారు. సకాలంలో ఆస్పత్రులకు చేర్చకుండా వందల మంది అమాయకుల ప్రాణాలు బలితీసుకున్న అరబిందో కంపెనీ యాజమాన్యంపై ఐపీసీ 302 సెక్షన్ కింద కేసులు నమోదు చేయాలన్నారు. బుధవారం మీడియా తో మాట్లాడుతూ.. వైసీపీ అధికారంలోకి రాగానే జీవీకే సంస్థతో ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాన్ని ఒక జీఓ ద్వారా బలవంతంగా రద్దు చేసిందన్నారు. జీవీకే సంస్థ చేసుకున్న ఒప్పందం ప్రకారం ఒక్కో అంబులెన్సుకు నెలకు రూ.1.31 లక్షలు అయితే అరబిందో కంపెనీకి రూ.1.78 లక్షలు చెల్లించారన్నారు. కొత్త అంబులెన్సుకు అయితే నెలకు రూ.2.21 లక్షలకు పెంచారని తెలిపారు. నిర్వహణ ఖర్చుల్లో చేసిన ఈ మార్పులతో రాష్ట్ర ప్రభుత్వ ఖజానాపై రూ.800 కోట్లకు పైగా భారం పడిందన్నారు. ఎవడబ్బ సొత్తు అని అరబిందో కంపెనీకి దోచిపెట్టారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. అరబిందో కంపెనీపై అంత ప్రేమ ఎందుకు అని నిలదీశారు. ఏ2 విజయసాయిరెడ్డి వియ్యంకుడి కంపెనీకి ప్రజల సొత్తును జగన్ రెడ్డి దోచిపెట్టారని మండిపడ్డారు. గోల్డెన్ అవర్ పాటించడంలోనూ అరబిందో విఫలమైందన్నారు. గతంలోనే ఈ విషయం కాగ్ స్పష్టం చేసినా వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. అరబిందో కంపెనీ అరాచకాలపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. 108 అంబులెన్సుల నిర్వహణకు సంబంధించి ప్రభుత్వం తమకు రూ.141 కోట్లు చెల్లించాలని అరబిందో కంపెనీ చెబుతోందని.. అరబిందో కంపెనీ ఏ2 విజయసాయిరెడ్డి వియ్యంకుడు రాంప్రసాద్ రెడ్డి, తన అల్లుడు రోహిత్‌కు చెందినదన్నారు. వైసీపీ ప్రభుత్వంలో 108 బాధ్యతలను చేజిక్కించుకున్న అరబిందో కంపెనీ వందల కోట్లు దోచుకుని ఎంతో మంది అమాయకుల ప్రాణాలు తీసిందని విమర్శించారు.

## ఐదేళ్ల విధ్వంసం నుంచి గట్టెక్కే ప్రయత్నం

విభజనతో నష్టపోయిన ఆంధ్రప్రదేశ్ ..ఒక ఎత్తయితే, గత ఐదేళ్ల జగన్ పాలనలో నష్టపోయింది కూడా అంతకు మించి అన్నట్లుగా ఉంది. ఒక్కో వ్యవస్థను పట్టాలకు ఎక్కించే ప్రయత్నాల్లో కూటమి ప్రభుత్వం ఉంది. తెలుగుదేశం కూటమి ప్రభుత్వం ఆ దిశగా ప్రణాళికలు రూపొందించి చర్యలు చేపట్టింది. సున్నాతో పరిపాలన ప్రారంభించి కూడా సన్‌రైజ్ ఆంధ్రప్రదేశ్ పేరుతో భాగస్వామ్య సదస్సుల్లో లక్షల కోట్ల విలువైన ఒప్పందాలతో ఐదేళ్ల క్రితంవరకు ఆంధ్రప్రదేశ్ ఒక వెలుగు వెలిగింది. పారిశ్రామికాభివృద్ధిలో రాష్ట్రం తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో దేశంలో మూడో స్థానంలో ఉండగా, ఐదేళ్ల జగన్ పాలనలో అట్టడుగుకు దిగజారింది. జగన్ దావోస్ పర్యటన కూడా వినోదాలకే తప్ప రాష్ట్రాభివృద్ధికి దోహదపడలేదు. పెట్టుబడులు రాబట్టేందుకు చేసింది శూన్యం. దావోస్ టూర్ ఖర్చులకు సరిపడా ఇన్వెస్ట్‌మెంట్స్ కూడా తేని ముఖ్యమంత్రిగా జగన్‌దే రికార్డు. గత ఐదేళ్లలో విశాఖ–చెన్నై పారిశ్రామిక కారిడార్‌కు వచ్చిన పెట్టుబడులెన్ని, నెలకొల్పిన పరిశ్రమలెన్ని, కల్పించిన ఉద్యోగాలెన్ని? వైఎస్సార్ జగనన్న మెగా ఇండస్ట్రియల్ హబ్ ఏమైంది? స్కీమ్‌లకు తన పేరు, తండ్రి పేరు పెట్టుకోడంలో ఉన్న శ్రద్ధ, తపన, వాటిని ఫలవంతం చేయడంలో లేకపోవడం కారణంగా ఎపి ఆర్థిక స్థితి అంతకంతకూ దిగజారింది. బడుగు బలహీన వర్గాల పారిశ్రామికవేత్తలనుఎదగనీయకుండా పాలనసాగింది. స్వయం ఉపాధిని పూర్తిగా అటకెక్కించారు. టిడిపి హయాంలో ఇచ్చిన రుణాల బలవంతపు వసూళ్లపైనే జగన్ ప్రభుత్వం దృష్టి సారించింది. చంద్రబాబు హయాంలో పారిశ్రామిక, సేవా రంగాలు జెట్ స్పీడ్‌తో పరుగులు తీస్తే, జగన్ రెడ్డి వచ్చాక తిరోగమన దిశగా సాగాయని ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. టిడిపి హయాంలో ఎకనామిక్ గ్రోత్ ఇంజిన్లను గుర్తించి వాటిపైనే పూర్తిగా దృష్టిపెట్టి జిఎస్‌డిపి పెంపునకు కృషి చేసింది. దానివల్లే వరుసగా నాలుగేళ్లు డబుల్ డిజిట్ గ్రోత్ సాధ్యమైంది. కానీ జగన్ పాలనలో ఆయా గ్రోత్ ఇంజన్లన్నీ రివర్స్ చేసి, నెగటివ్ ట్రెండ్ తెచ్చారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, ముస్లిం మైనార్టీల జీవన ప్రమాణాలు పూర్తిగా దిగజారాయి. మైనస్ గ్రోత్, నిరుద్యోగం, ద్రవ్యోల్బణం, సున్నా పెట్టుబడులతో బడుగుల సంక్షేమం సంక్షోభంలో చిక్కుకుంది. జగన్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల ఆకర్షణలో రాష్ట్రం 13వ స్థానానికి పడిపోయింది. గత ఐదేళ్ల కాలంలో రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించి భయానక వాతావరణం నెలకొనడం, ప్రతి పనిలో నీకది నాకిది అనే ఫార్ములాకు భయపడి పారిశ్రామికవేత్తలు పారిపోయారని పయ్యావుల అన్నారు. దేశంలోనే అతిపెద్ద ఎఫ్‌డిఐ రూ.13,500 కోట్ల పెట్టుబడితో 18వేల మందికి ఉద్యోగాల కల్పనతో అనంతపురంలో కియా కార్ల తయారీ పరిశ్రమను తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో నెలకొల్పితే వైసీపీ ఎంపీ, మంత్రుల బెదిరింపుల కారణంగా కియా ఆగ్జిలరీ యూనిట్లు ఇతర రాష్ట్రాలకు తరలిపోయాయన్నారు. కర్నూలులో సోలార్, విండ్ పవర్ ప్లాంట్లను తెలుగుదేశం ప్రభుత్వం పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తే వాళ్ళను వైసీపీ నాయకులు తుపాకులతో బెదిరించి సోలార్ ప్యానళ్లను ధ్వంసం చేశారు. అమరావతిలో 139 సంస్థలకు భూములు కేటాయిస్తే రాజధాని పనులు ఆపేసి ఆయా సంస్థలు రాకుండా అడ్డుకొన్నారు. రాజకీయ కక్షసాధింపు చర్యలతో పరిశ్రమలు రాష్ట్రం నుండి వెళ్లి పోగా, కొత్తగా రాష్ట్రానికి పారిశ్రామికవేత్తలు రావాలంటేనే వణికి పోయాన్నారు. అందుకే మళ్లీ అందరిలో నమ్మకం కలిగించి ముందుకు సాగుతున్నామని మంత్రి కేశవ్ అన్నారు. వైసిపి పాలనలో ఒక్క సమ్మిట్ నిర్వహించకపోగా టిడిపి ప్రభుత్వం తెచ్చిన పెట్టుబడులను వెళ్లగొట్టి 32 లక్షల మంది యువతకు ఉద్యోగాలు రాకుండా చేసిన ఘనత జగన్ రెడ్డిదన్నారు. ఆంధ్రప్రదేశ్ వివిధ రంగాల్లో పెట్టుబడులు ఆకర్షించేందుకు పాలనలో చూపిన సమర్థత, నిరంతర శ్రమ, సరళీకృత విధానాలు, పలు సంస్కరణలు సులభతర వాణిజ్యంలో ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకోవడానికి దోహదపడ్డాయి.

# డాక్టర్ సీటొచ్చినా.. కూలి పనికెళ్తున్న యువతి

## మూడేళ్ల వయసులో తల్లిదండ్రులను కోల్పోయిన వైనం

## దాతలు ఆదుకోవాలని వేడుకోలు



**నూతనకల్(క్రైమ్ మిర్రర్):** చదువుల తల్లికి ఆర్థిక పరిస్థితి సహకరించకపోవటంతో డాక్టర్ కావాలనుకున్న కోరిక నెరవేరటం లేదు.ఎలాగైనా డాక్టర్ కావాలనే తపన

ఆ అనాథ బిడ్డది.అందుకోసం కూలీ పనులు చేస్తూనే కష్టపడి చదివింది.వివరాలలోకి వెళ్తే సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండలం వెంపటి గ్రామానికి చెందిన శిగ గౌతమి తన మూడేళ్ల వయస్సులోనే తల్లిదండ్రులను కోల్పోయింది. దీంతో గౌతమిని తాత శిగ రాములు గౌడ్, నాయనమ్మ వెంకటమ్మ కూలి పనులు చేస్తూ పోషించారు.స్వగ్రామంలోని సర్కారు బడిలో ఐదో తరగతి వరకు, పసునూర్ ఆదర్శ పాఠశాలలో పదో తరగతి, ఇంటర్మీడియట్ చదివించారు. గౌతమి పదో తరగతిలో 10/10 జీపీఏ, ఇంటర్ బైపీసీలో 992/1000 మార్కులు సాధించి టాపర్‌గా నిలిచింది.వైద్యురాలు కావాలనే కోరికతో నీట్‌కు హాజరై మొదటి ప్రయత్నంలోనే దంత వైద్య కళాశాలలో సీటు సాధించింది. దంత వైద్యురాలు కావడం ఇష్టం లేక మళ్లీ నీట్ రాయాలనుకున్న ఆమెకు ఆర్థిక సమస్యలు గుదిబండగా మారాయి. అయినప్పటికీ నానమ్మ పుస్తెలతాడు తాకట్టుపెట్టి హైదరాబాద్‌లో కోచింగ్‌కు పంపారు.గౌతమి డాక్టర్ కావాలనే లక్ష్యంతో తాత, నానమ్మతో కలిసి కూలి పనులకు వెళ్తూనే రెండోసారి నీట్‌కు సిద్ధమైంది. ఈసారి నీట్‌లో 507 మార్కులు సాధించి ఇటీవల జరిగిన ఎంబీబీఎస్ కౌన్సెలింగ్‌లో మంచిర్యాల ప్రభుత్వ వైద్య కళాశాలలో సీటు సంపాధించింది. కానీ ఎంబీబీఎస్ చదవడానికి ఏడాదికి రూ.1,50,000 ఖర్చు అవుతుందని, అంత ఆర్థిక స్థోమత లేకపోవడంతో చేసేది లేక కూలి పనులకు వెళ్లున్నట్లు శిగ రాములు తెలిపారు.ఫీజుకోసం అమ్మటానికి కూడా వారికి ఎలాంటి ఆస్తులు లేకపోవడంతో దాతల సాయం కోసం ఎదురుచూస్తున్నారు. ఎవరైనా ఆర్థిక సహాయం చేస్తే తమ బిడ్డ ఆశ నెరవేరుతుందని గౌతమి తాత, నానమ్మ వేడుకుంటున్నారు. సహాయం చేయాలనుకున్న దాతలుశిగ గౌతమి బ్యాంకు ఖాతా నెంబరు 1938108022252

**IFSC:. CNRB0001938**

లేదా గౌతమి మేనత్త తొట్ల మంజుల ఫోన్ పే నంబర్ 9398919127 కు ఆర్థిక సహాయం అందించాలని కోరుతున్నారు.

# వీధి దీపాల ఏర్పాటుపై రాజకీయ దుమారం..!

**క్రైమ్ మిర్రర్, మిర్యాలగూడ:** నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలం అవంతిపురం గ్రామపంచాయతీ లో వీధి దీపాల ఏర్పాటు చేయుట కొరకు ఐదు నెలల క్రితం చేసిన తీర్మానానికి ఇటీవల వీధి దీపాలు ఏర్పాటు చేయడం సంచలనంగా మారింది. మాజీ ఎంపిటిసి వల్దాసు సుజాత భర్త సురేష్, స్థానిక ఎమ్మెల్యే సహకారంతో వీధి దీపాలు వేస్తున్నామని సోషల్ మీడియాలో ప్రచారం చేసుకోవడం జరిగింది . నవంబర్ 4, 2024 నాటికి సురేష్ ఈ పనులను వాట్సాప్ గ్రూపులలో ఫోటోలు షేర్ చేస్తూ ప్రచారం చేయగా, గ్రామ ప్రజలలో ఇందుకు సంబంధించి సందేహాలు వ్యక్తమయ్యాయి.ఈ వ్యవహారంపై గ్రామపంచాయతీ స్పెషల్ ఆఫీసర్ మౌనిక ను చారవాణి ద్వారా వివరణ కోరగా... వీధి దీపాల ఏర్పాటుకు అవసరమైన నిధులు గ్రామపంచాయతీ నుంచే వేచుంచి చున్నట్లు స్పష్టం చేశారు. అయితే, గ్రామస్తులు ప్రజాధనంతో చేస్తున్న అభివృద్ధి పనులకు రాజకీయ రంగు పుల్ముకొని ఒక పార్టీ కార్యకర్త స్థానిక ఎమ్మెల్యే సహకారంతో అని సోషల్ మీడియాలో ప్రచారం చేసుకోవడం ఎంతవరకు కరెక్ట్ అని చర్చించుకుంటున్నారు. ఇట్టి ప్రచారం అంతా కూడా అవంతిపురం సోషల్ మీడియాలో వైరల్ కావడంతో సామాజిక కార్యకర్త అయినటువంటి నాగటి సుదీర్ బాబు ఈ పనులు పంచాయతీ నిధులతో చేయాల్సిన సమయంలో, ఒక పార్టీకి చెందిన వ్యక్తి,కార్యకర్తలు ఈ పనులు ఎలా చేస్తారని.. రాబోవు ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని స్పెషలాఫీసర్ ఈ వ్యవహారం అంతా తానే వెనుక ఉండి చేస్తున్నారని ఆరోపించారు.





ఇది ప్రభుత్వం నిధుల దుర్వినియోగం మాత్రమే కాకుండా, నియమ నిబంధనలకు విరుద్ధమని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ విషయమై డి.ఏ.ఓ శర్మ గారికి ఫిర్యాదు చేసినట్లు సుదీర్ బాబు తెలిపారు.

# నిరుద్యోగులకు గొప్ప వరం స్కిల్ యూనివర్సిటీ ః కె ఎల్ ఆర్

### యూనివార్సిటీలో అంతర్జాతీయ ప్రమాణాలతో క్రీడా, విద్య,వైద్య ప్రాంగణాలు

### సచివాలయంలో ఉన్నత స్థాయి అధికారులు,మంత్రుల సమావేశంలో పాల్గొన్న కె ఎల్ ఆర్



**మహేశ్వరం ప్రతినిధి(క్రైమ్ మిర్రర్):** మహేశ్వరం నియోజకవర్గంలో గ్రీన్ ఫార్మాలో ఏర్పాటు అవుతున్న స్కిల్ యూనివర్సిటీలో విద్యతో పాటు వైద్య, క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేసి అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలు అందేలా చర్యలు తీసుకుంటామని మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు. గురువారం సచివాలయంలో ఏర్పాటు అయిన ఉన్నత స్థాయి అధికారులు,మంత్రుల సమావేశంలో కె ఎల్ ఆర్ పాల్గొన్నారు.ఫోర్త్ సిటీలో పెట్టుబడులు,మౌలిక సదుపాయాల ఏర్పాట్లపై చర్చించారు.ఈ సందర్భంగా కేఎల్ఆర్ మాట్లాడుతూ.వచ్చే కంపెనీలకు ఉద్యోగులు కావాలి చదువుతో పాటు సరైన స్కిల్స్ లేకపోవడంతో నిరుద్యోగులుగా మారుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.మహేశ్వరం నియోజకవర్గంలో ఉన్న నిరుద్యోగులు తప్పకుండా స్కిల్ యూనివర్సిటీలో చేరి మంచి ఉపాధి,ఉద్యోగ అవకాశాలు పొందాలని సూచించారు.ప్రభుత్వ ఉద్యోగాల కంటే ప్రైవేటు కంపెనీల్లో ఎక్కువ జీతాలు వచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని కేఎల్ఆర్ తెలిపారు.

# శ్రీ శివగంగా రాజరాజేశ్వరి స్వామి దేవాలయంలో వివాహ వేడుకలు

### ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

**మహేశ్వరం ప్రతినిధి (క్రైమ్ మిర్రర్):** మహేశ్వరం నియోజకవర్గం బడన్గ్ పేట్ డిప్యూటీ మేయర్ తీగల విక్రం రెడ్డి బందువుల వివాహ మహోత్సవం మహేశ్వరం మండల కేంద్రంలోని సుప్రసిద్ధ దేవాలయం శ్రీ శివగంగా రాజరాజేశ్వరి స్వామి వారి దేవాలయం ఆవరణలో కన్నులపండుగగా నిర్వహించారు ఈ వివాహానికి ముఖ్య అతిధిగా హాజరై నూతన వదువరులను ఆశీర్వదించిన మాజీమంత్రి,మహేశ్వరం నియోజకవర్గ శాసనసభ్యురాలు సబితా ఇంద్రారెడ్డి తోపాటు ప్రజాప్రతినిధులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.





# విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో పొలంబాట !

**జగిత్యాలజిల్లా ప్రతినిధి (క్రైమ్ మిర్రర్):** గొల్లపల్లి మండలంలోని లోత్తునూరు గ్రామంలో విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో పొలంబాట కార్యక్రమాన్ని నిర్వహించారు.రైతులు లోవోల్టేజి సమస్య రాకుండా కెపాసిటర్లు బిగించుకోవాలని టిజిఎన్‌పిడిసిఎల్ గొల్లపల్లి ఎ.డి.ఇ వరున్ కుమార్ మాట్లాడుతూ రైతులు వారి పొలాల వద్ద స్టార్టర్లు, ఫ్యూజులు, స్టార్టర్ బాక్సులు నాణ్యతగా ఉండేలా చూసుకోవాలన్నారు, మోటర్ లకు కెపాసిటర్లు బిగించుకోవాలని సూచించారు. విద్యుత్ పరంగా ఏమైనా సమస్యలుంటే విద్యుత్ సిబ్బందికి మరియు టోల్ ఫ్రీ నెంబర్ 1912 కు సమాచారం అందించాలని సూచించారు. పొలాల చుట్టు అక్రమంగా విద్యుత్ కంచెలు ఏర్పాటు చేయవద్దని, తద్వారా రైతులు, పశువులు విద్యుత్ ప్రమాదాలకు గురికా కుండా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో చిల్వాకోడూరు ఎ.ఇ. అనిల్ కుమార్, చిల్వాకోడూరు సెక్షన్ విద్యుత్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

# సృజనాత్మక శక్తికి - శాస్త్రీయ ఆలోచనల తోడ్పా టే చెకుముకి సైన్స్ సంబరాలు

### గాంధీజీ విద్యా సంస్థల చైర్మన్ కోడి శ్రీనివాసులు



**క్రైమ్ మిర్రర్,నాంపల్లి:** జన విజ్ఞాన వేదికలో భాగంగా సమగ్ర శిక్ష తెలంగాణ ప్రభుత్వ సహకారంతో చెకుముకి సైన్స్ సంబరాలు -2024 పాఠశాల స్థాయి టాలెంట్ టెస్ట్ ను నాంపల్లి మండల కేంద్రంలో వివిధ పాఠశాలలో గురు వారం ప్రభుత్వ, ప్రైవేట్ స్థానిక గాంధీజీ పాఠశాలలో విద్యార్థులకు నిర్వహించారు. టెస్ట్ అనంతరం ఫలితాలను వెంటనే ప్రకటించారు. ఈ ఫలితాలలో గాంధీజీ ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థులు 8వ తరగతి నుంచి పి.వంశీ , 9వ తరగతి కె రోహిత్, పదవ తరగతి నుంచి జే.కావ్య ఈనెల 21న జరిగే మండల స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలకు సెలక్ట్ అయినట్లు ట్రస్మా జిల్లా అధ్యక్షులు, గాంధీజీ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు, తెలిపారు. జిల్లా స్థాయి సైన్స్ సంబరాలు నవంబర్ 28న, రాష్ట్ర స్థాయి సైన్స్ సంబరాలు డిసెంబర్ 14,15,16 న ఆదిలాబాద్ లో జరిగే సైన్సు సంబరాలకు విద్యార్థులు సన్నద్ధం కావాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సైన్స్ పట్ల ఆసక్తిని కలిగించడానికి, సైన్స్ లో ప్రావీణ్యతను పెంచడానికి, సృజనాత్మక శక్తి వెలికి తీయడానికి, శాస్త్రీయ ఆలోచనలు తోడ్పడే విధంగా సైన్స్ సంబరాలను తెలంగాణ ప్రభుత్వం సమగ్ర శిక్ష విభాగం చేయూతనిచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ సరి కొండ వెంకన్న, ప్రిన్సిపల్ వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు విద్యార్థులు తది తరులు పాల్గొన్నారు.

# కుల గణన సర్వేను పకడ్బందీగా చేయాలి

### చౌడపూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎల్పటి అశోక్ కుమార్



ఫ్రైమ్ మిర్రర్ కుల్కచర్ల: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కులం గణన సర్వేను పకడ్బందీగా చేయాలని చౌడపూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అశోక్ కుమార్ సూచించారు.వికారాబాద్ జిల్లా చౌడపూర్ మండల కేంద్రంలో నిర్వహిస్తున్నటువంటి కులగణన మండల అధ్యక్షుడు ఎల్పటి అశోక్ కుమార్ సర్వే ఏ విధంగా జరుగుతుందో ఎన్యుమరేటరును సుకన్యను అడిగి తెలుసుకోవడం జరిగింది. అదేవిధంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పరిగి నియోజకవర్గ ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి నాయకత్వంలో ప్రజలు చాలా సంతోషంగా ఉన్నారని ఆయన అన్నారు.జరుగుతున్నటువంటి సర్వే ను ఉద్దేశించి ప్రజలందరూ సానుకూలంగా జవాబు ఇవ్వడం జరిగింది.కార్యక్రమంలో మహిళ విభాగం నాయకురాలు సాయిలమ్మ, మండల మైనార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ సలీం,సీనియర్ నాయకులు మాసయ్య,గ్రామ కమిటీ అధ్యక్షులు శేవ్వ యాదయ్య,ఉపాధ్యక్షులు ఎరుకలి.యాదయ్య,కృష్ణ,అంజి,మండల యువజన విభాగం నాయకుడు శరత్ కుమార్, బుచ్చయ్య, తదితరులు పాల్గొన్నారు..



# గాయ్...గాయ్ గత్తర చేస్తున్న రేవంత్

## ఎక్స్ వేదికగా హరీశ్‌రావు విమర్శలు

**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** సచివాలయంలో సీఎం రేవంత్ రెడ్డి చేపడుతున్న వాస్తు మార్పులపై మాజీ మంత్రి హరీశ్ రావు స్పందించారు. నాడు కేసీఆర్ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా గ్రీన్ టెక్నాలజీ, ఫైర్ సేఫ్టీ నార్మ్స్ తో దేశానికే తలమానికమైన కొత్త సెక్రటేరియట్ నిర్మిస్తే వాస్తు పిచ్చని నాడు రేవంత్ రెడ్డి గాయ్ గాయ్ గత్తర గత్తర చేసిండు. ఇప్పుడు ముఖ్యమంత్రిగా సెక్రటేరియట్‌కు పూటకో మార్పు చేస్తున్నాడని ఎద్దేవా చేశాడు. వాస్తు దోషం ఉందని ఒక్క గేట్ మార్పు చేయటానికి రూ.4 కోట్లు ఖర్చు పెడుతున్నారని ఇది కదా అసలు సిసలైన కాంగ్రెస్ మార్కు మార్పు అని ఎక్స్ వేదికగా స్పందించారు. ఇకనైనా పాలనపై దృష్టి పెట్టి ప్రజలకు మేలు జరిగే పనులు చేపట్టాలని హితవు పలికారు.

# జగన్...గతం మరిచ విమర్శలా

## పాపాల చిట్టాను ప్రజలు మరవలేదు

## చంద్రబాబు రాకతో నేరాలకు అడ్డుకట్ట

## మంత్రి అనగాని సత్యప్రసాద్

**అమరావతి,(క్రైమ్ మిర్రర్):** తన హయాంలో జరిగిన నేరాలు, ఘోరాలు గురించి కప్పిపుచ్చుకుని, ఇప్పుడు జగన్ నీతులు వల్లిస్తున్నారని మంత్రి అనగాని సత్యప్రసాద్ మండిపడ్డారు. జగన్ తన పాపాలను కప్పిపుచ్చుకోలేరని అన్నారు. కళ్లుండి చూడలేని కబోధిలా వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి వ్యవహరిస్తున్నారని మంత్రి అనగాని మండిపడ్డారు. చంద్రబాబు సారధ్యంలోని కూటమి ప్రభుత్వ పాలనలో మహిళలపై 25 శాతం మేర నేరాలు తగ్గాయని గురువారం అమరావతిలో ఆయన వివరించారు. మరి ఈ విషయం కనిపించడం లేదా? అంటూ మాజీ సీఎం వైఎస్ జగన్‌ను మంత్రి అనగాని సత్య ప్రసాద్ సూటిగా ప్రశ్నించారు. మీ పాలనలో ప్రతి 8 గంటలకు ఒక రేప్, ప్రతి గంటకు ఇద్దరు మహిళలపై లైంగిక దాడులు జరిగేవని గుర్తు చేశారు. ఇది వాస్తవం కాదా జగన్? అంటూ మంత్రి అనగాని బల్లగుద్ది ప్రశ్నించారు. వ్యక్తిత్వ హననం చేయడంలో నిన్ను మించిన వాడు ప్రపంచంలోనే లేడంటూ వైఎస్ జగన్‌పై నిప్పులు చెరిగారు. చివరకు తల్లిని, చెల్లిని సైతం ఈ జగన్ రెడ్డి వదల లేదని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. అసభ్య పోస్టింగులు, సమాజాన్ని విధ్వంసం చేసే పోస్టులు పెట్టిన వారిని చట్టబద్ధంగా అరెస్ట్ చేయడం చీకటి రోజులైతే... నీ పాలనలో పెట్టిన వేల కొద్ది అక్రమ కేసులను ఏమనాలి? జగన్ రెడ్డి అంటూ మంత్రి అనగాని మండిపడ్డారు. ప్రతిపక్ష పార్టీల నేతలను నరికి చంపించిన నీవు శాంతిభద్రతలు గురించి మాట్లాడుతుంటే దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉందని మంత్రి అనగాని సత్యప్రసాద్ అభివర్ణించారు.

# అక్రమంగా పిజి మెడికల్ సీట్ విక్రయం

## మాజీమంత్రి మల్లారెడ్డికి ఇడి నోటీసులు



**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** పీజీ మెడికల్ కాలేజీ సీట్లు అక్రమంగా విక్రయించారనే అభియోగాలపై మాజీ మంత్రి సిహెచ్ మల్లారెడ్డికి ఈడీ అధికారులు గురువారం నోటీసులు జారీ చేశారు. దీనిపై ఈ రోజు జరిగే విచారణకు హాజరు కావాలని ఆయనకు జారీ చేసిన నోటీసుల్లో ఈడీ స్పష్టం చేసింది. దీంతో ఈడీ ఎదుట విచారణకు మల్లారెడ్డి మెడికల్ కాలేజీ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సురేందర్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఈడీకి ఆయన వివరణ ఇచ్చినట్లు సమాచారం. తెలంగాణలో పలు మెడికల్ కాలేజీల్లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ సీట్లు విక్రయించారంటూ ఆరోపణలు వెల్లువెత్తాయి. ఆ క్రమంలో ఈడీకి ఫిర్యాదులు అందాయి. ఈ నేపథ్యంలో ఈడీ రంగంలోకి దిగింది. అందులోభాగంగా గతేడాది జూన్‌లో మాజీ మంత్రి సీహెచ్ మల్లారెడ్డి నివాసం, మెడికల్ కాలేజీతోపాటు కార్యాలయాలపై ఈడీ సోదాలు నిర్వహించింది. అలాగే 12 మెడికల్ కాలేజీల్లో సైతం సోదాలు చేపట్టింది. ఈ సందర్భంగా కీలక డాక్యుమెంట్లు, పెన్‌డ్రైవ్‌లు, హార్డ్‌డిస్క్‌లను సైతం ఈడీ స్వాధీనం చేసుకుంది. రాష్ట్రంలోని 10 ప్రైవేట్ మెడికల్ కాలేజీల్లోని 45 సీట్లను బ్లాక్ చేసి విక్రయించినట్లు.. ఈడీ తన సోదాల్లో గుర్తించింది. దాంతో దీనిపై వివరణ ఇవ్వాలంటూ మాజీ మంత్రి సీహెచ్ మల్లారెడ్డితోపాటు వివిధ ప్రైవేట్ మెడికల్ కాలేజీలకు ఈడీ నోటీసులు జారీ చేసింది.





## తలా, తోకా లేని సీసీఐ కండిషన్లు...

# ఇబ్బందుల్లో రైతులు

### ట్రాక్టర్ల ద్వారానే పత్తిని తీసుకురావాలన్న సిసిఐ కండిషన్ పై రోడెక్కిన పత్తి రైతు

### ఒక్క మాల్ సెంటర్ కేనా ఈ నిబంధన?!... మరి కొంతమందికి డీసీఎంల ద్వారా ఎలా అనుమతిస్తున్నారు??

### మహబూబ్ నగర్ సీసీఐ కేంద్రం జనరల్ మేనేజర్ సమాధానం చెప్పాలి

### 15% తేమ ఉన్న పత్తిని కొనుగోలు చేయాల్సిందే... లేకపోతే పత్తి రైతుకు ఆత్మహత్యే శరణ్యం









**( క్రైమ్ మిర్రర్ ప్రత్యేక ప్రతినిధి ):** కాటన్ కంపెనీ ఆఫ్ ఇండియా ( సీసీఐ ) కేంద్రాల వద్ద అధికారుల తలా తోక లేని నిబంధనలతో పత్తి రైతులు తీవ్ర ఇక్కట్ల పాలవుతున్నారు. సిసిఐ కేంద్రాల వద్దకు ట్రాక్టర్ల ద్వారానే పత్తిని తీసుకువస్తేనే కొనుగోలు చేస్తామని అధికారులు పేర్కొనడం హాస్యాస్పదంగా ఉందని పత్తి రైతులు మండిపడుతున్నారు. ఈ తరహా తలా తోకాలేని నిబంధనలను విధించడం ఏమిటంటూ మహబూబ్ నగర్ సీసీఐ కేంద్రం జనరల్ మేనేజర్ ను పత్తి రైతులు ప్రశ్నిస్తున్నారు. మహబూబ్ నగర్ సిసిఐ కేంద్రం పరిధిలోని తొమ్మిది జిల్లాలలో పత్తి కొనుగోలు కేంద్రాలను నిర్వహిస్తుంటారని, ఇతర కేంద్రాలలో ఎక్కడా లేని ఈ నిబంధనను కేవలం మాల్ సెంటర్ లోనే అమలు చేయడం వెనుక అంతర్యం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. మహబూబ్ నగర్ కేంద్రం సిసిఐ జనరల్ మేనేజర్ విధించిన తాజా షరతుపై చింతపల్లి మండల కేంద్రంలో పత్తి రైతులు నిరసనకు దిగారు. ట్రాక్టర్ల ద్వారానే పత్తిని సేకరిస్తామంటే, 100 క్వింటాళ్లు పండించిన పత్తి రైతు ఎన్నిసార్లు సీసీఐ కేంద్రం చుట్టూ తిరగాలని ప్రశ్నించారు. మహబూబ్ నగర్ కేంద్రం జనరల్ మేనేజర్ తన పరిధిలోని అన్ని కేంద్రాలకు ఒకే నిబంధన అమలు చేయాల్సి ఉండగా, కేవలం మాల్ సెంటర్ కు మాత్రమే ఈ తరహా నిబంధనను అమలు చేయడం వెనుక కుట్ర కోణం దాగి ఉందని పత్తి రైతులు మండిపడుతున్నారు . మాల్ కేంద్రంలో కొంతమంది రైతులు డీసీఎం ల ద్వారా పత్తిని తీసుకొచ్చిన కొనుగోలు చేస్తూ, మరి కొంతమందికి మాత్రం ట్రాక్టర్ల ద్వారానే పత్తిని తీసుకురావాలని షరతు విధించడం వెనుక ఆంతర్యం ఏమిటని నిలదీస్తున్నారు. పత్తి రైతులతో సిసిఐ కేంద్రం అధికారులు ఆటలాడుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే పత్తిలో తేమ 15% వరకు ఉన్న కూడా కొనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేశారు. పత్తిని తీసుకొని వచ్చి రైతు, రెండు మూడు రోజులపాటు సిసిఐ కేంద్రాల వద్ద పడిగాపులు పడుతున్నాడని తెలిపారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల దృష్ట్యా పత్తిలో తేమ 15 శాతం వరకు ఉండడం సర్వసాధారణమైన అని పత్తి రైతులు తెలిపారు. సీసీఐ నిబంధనల ప్రకారం 12 శాతం వరకు పత్తిలో తేమ ఉంటే కొనుగోలు చేయవచ్చునని అంటున్నారని, మరో మూడు శాతం కూడా మినహాయింపు నివ్వాలని పత్తి రైతులు డిమాండ్ చేస్తున్నారు. ట్రాక్టర్ల ద్వారానే కాకుండా డీసీఎంల ద్వారా తీసుకువచ్చిన పత్తిని కూడా సీసీఐ కేంద్రాలలో కొనుగోలు చేయాలని పత్తి రైతులు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో మహబూబ్ నగర్ జిల్లా సిసిఐ కేంద్రాన్ని ముట్టడిస్తామని పత్తి రైతులు హెచ్చరించారు.

# ఫార్ములా ఇష్యూలో అసలు దోషి రేవంతే

### రూ.800 కోట్ల నుంచి 900 కోట్లు రాకుండా అడ్డుకున్నాడు

### రేవంత్‌ను జైలుకు పంపాలి : టీఎస్ రెడ్కో మాజీ చైర్మన్ వై.సతీష్ రెడ్డి

**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** ఫార్ములా ఈ రేసు విషయంలో అసలు దోషి రేవంత్ రెడ్డి అని, ప్రస్తుతం రాష్ట్రానికి మున్సిపల్ మంత్రిగా ఉన్న రేవంత్ రెడ్డే.. రూ.50 కోట్లు నష్టపోవడానికి కారణమయ్యారని టీఎస్ రెడ్కో మాజీ చైర్మన్ వై.సతీష్ రెడ్డి ఆరోపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..రాష్ట్రానికి రావాల్సిన దాదాపు రూ. 800 కోట్ల నుంచి రూ.900 కోట్ల పెట్టుబడులు రాకుండా అడ్డుకున్నారని విమర్శించారు. కావున రేవంత్‌పై చర్యలు తీసుకొని జైలుకు పంపాలన్నారు. ఎలక్ట్రిక్ వాహనాల వైపు ప్రజలు ఆసక్తి చూపించేలా వారికి అవగాహన కల్పించే ఉద్దేశంతో నాడు ఫార్ములా ఈ రేస్ నిర్వహించడానికి మున్సిపల్ శాఖ మంత్రిగా కేటీఆర్ ఎంత కష్టపడ్డారో.. రెన్యూయెబుల్ ఎనర్జీ డెవలప్ మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గా నేను దగ్గరుండి చూశాన్నారు. ఫార్ములా ఈ ఆపరేషన్స్ సంస్థను ఒప్పించి, ప్రమోటర్లను తీసుకొచ్చి విజయవంతంగా ఈవెంట్ నిర్వహించారు. మొట్టమొదటి ఫార్ములా ఈ రేస్ ఎక్కడ జరిగింది అంటే.. హైదరాబాద్ లోనే అని భవిష్యత్ తరాలు కూడా చెప్పుకుంటాయి. అంతేకాదు ఈ మొబిలిటీ వీక్ పేరుతో కార్యక్రమాలుచేపట్టి ఎలక్ట్రిక్ వాహనాల గురించి ప్రజలకు అవగాహన కల్పించే ప్రయత్నం చేశారని గుర్తు చేశారు. అలాగే ఫార్ములా ఈ రేస్ నిర్వహణతో హైదరాబాద్‌కు గ్లోబల్ ఇమేజ్ వచ్చింది. అంతర్జాతీయ ప్రముఖులు, సినీ, క్రీడారంగా ప్రముఖులు హైదరాబాద్‌కు వచ్చి ఈ ఈవెంట్‌లో పాల్గొన్నారు. ప్రస్తుతం బీజేపీ ఎంపీగా ఉన్న కొండా విశ్వేశ్వర్ రెడ్డి కూడా ఫార్ములా ఈ రేస్ ను స్వాగతించారు. స్వయంగా ఆయన కుమారుడే ఈ రేస్ లో పాల్గొన్నారని పేర్కొన్నారు. 2023లో జరిగిన ఈవెంట్‌కు ప్రభుత్వం చేసిన ఖర్చు ఒక్క రూపాయి కూడా వృథా కాలేదు. దాదాపు రూ.700 కోట్ల విలువైన పెట్టుబడులు వచ్చాయన్నారు. ప్రభుత్వం స్వయంగా ఖర్చు పెట్టింది తక్కువే అయినా.. రాష్ట్రానికి జరిగిన లాభం మాత్రం చాలా ఎక్కువని స్పష్టం చేశారు. 2024లో కూడా రేస్ మన రాష్ట్రంలోనే జరగాలని, మరిన్ని పెట్టుబడులు వస్తాయని కేటీఆర్ భావించారు.

# సోషల్ మీడియా దుష్ప్రచారం దారుణం

### ఉగ్రవాదుల కన్నా వారు ప్రమాదకరం

### అలాంటి వారిపై చర్యలు తీసుకోకుండా ఉండలేం

### హోంమంత్రి అనిత హెచ్చరిక



**అమరావతి, (క్రైమ్ మిర్రర్):** పులివెందుల ఎమ్మెల్యే నోటి నుంచీ వినకూడని మాటలు వస్తున్నాయని హోంమంత్రి వంగలపూడి అనిత ఎద్దేవా చేశారు. రాజకీయాలలో ఎవరున్నా.. మా కుటుంబ సభ్యులను సైతం నీచంగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. గత ప్రభుత్వ హయాంలో అమరావతి మహిళా రైతులు మానసిక క్షోభకు గురయ్యారన్నారు. మేం ఏరోజూ మిమ్మల్ని అడ్డుకోలేదన్నారు. ఇప్పుడు మీ ఆఫీసుల మీద దాడులు జరగలేదే అంటూ జగన్‌ను ఉద్దేశించి మాట్లాడారు. మాది ప్రజారంజక పరిపాలన.. 28 శాతం క్రైం రేట్ తగ్గిందన్నారు. రాజకీయ లబ్దికోసం అభంశుభం తెలీని ఆడపిల్లల విషయంలో మాట్లాడొద్దన్నారు. గత ప్రభుత్వ హయాంలో పోలీసులను పని చేయనివ్వలేదని విమర్శించారు. మేం చేస్తున్న అరెస్టులు తప్పు కాదని.. ఏది పడితే అది మాట్లాడితే చూస్తూ ఊరుకోవాలా అంటూ మండిపడ్డారు. సోషల్ మీడియాలో పెట్టే పోస్టులు, ప్రచారంపై ఉగ్రవాదుల కంటే ఎక్కువ సీరియస్‌గా తీసుకోవాలన్నారు. ఇలాంటి వారికి బెయిల్ ఇవ్వడానికి వార్ రూం ఏర్పాటు చేస్తారట..భావ స్వేచ్ఛా ప్రకటనకి కూడా ఒక లిమిట్ ఉంటుందన్నారు. సోషల్ మీడియాను ఉగ్రవాదుల కంటే ఎక్కువగా తీసుకోవాలన్నారు. పేట్రేగిపోయి సోషల్ మీడియా ముసుగులో నోటికొచ్చినట్టు బూతులు మాట్లాడితే ఎవరినీ వదలమని హెచ్చరించారు. దీనికోసం ప్రత్యేక చట్టాన్ని తీసుకు రావడానికి సిద్ధమయ్యామని చెప్పారు. స్పెషల్ కోర్టులు ఏర్పాటు చేస్తామన్నారు. ఎన్డీఏ ప్రభుత్వంలో పోలీసు తలెత్తుకు తిరిగేలా చేస్తామన్నారు. ఎన్డీఏ కూటమిలో బరి తెగించే వాళ్ళు లేరన్నారు. నా మీద జాలి ఎందుకు కానీ? చాలామంది ఉన్నారు జాలి పడాల్సిన వారు ఉన్నారన్నారు. టీడీపీ వాళ్ళు పోస్టులు పెట్టినా కూడా వదలమన్న హోంమంత్రి.. మహిళ ఎవరైనా మహిళేనని స్పష్టం చేశారు.

# తండ్రి నుంచి అప్పు తీసుకుని మరీ!!
# మకుటం లేని మహారాజుగా ఎదిగి..



ప్రపంచ దేశాలు ఇప్పుడు అమెరికావైపు చూస్తున్నాయి. అధ్యక్ష ఎన్నికలో ఎవరు గెలుస్తారు?. అగ్రరాజ్య ముఖచిత్రాన్ని మార్చేది ఎవరు? అనే దాని కోసం ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు. ఒకవైపు డెమోక్రటిక్ పార్టీ తరఫున ఉపాధ్యక్షురాలు కమలా హారిస్, మరోసారి వైట్‌హౌజ్ నుంచి పాలించాలని రిపబ్లికన్ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ ఉవ్విళ్లూరుతున్నారు. అయితే.. రాజకీయాల్లోకి రాకముందు.. ట్రంప్ రియల్ ఎస్టేట్ రంగంలో మకుటం లేని మహారాజు అనే విషయం మీకు తెలుసా?.. డొనాల్డ్ ట్రంప్ న్యూయార్క్ రియల్ ఎస్టేట్ వ్యాపారి ఫ్రెడ్ ట్రంప్‌కు నాలుగో సంతానం. 13 ఏళ్ల వయసులో ట్రంప్ సైనిక్ అకాడమీలో చేరాడు. ఆ తరువాత యూనివర్శిటీ ఆఫ్ పెన్సిల్వేనియా.. వార్టన్ స్కూల్ నుంచి డిగ్రీ పొందిన తరువాత కుటుంబ వ్యాపారంలోకి అడుగుపెట్టాడు.కుటుంబ వ్యాపారంలోకి అడుగుపెట్టడాని ముందే ట్రంప్ తన తండ్రి నుంచి కొంత మొత్తం అప్పుగా తీసుకుని రియల్ ఎస్టేట్‌లోకి ప్రవేశించినట్లు సమాచారం. ఆ తరువాత తండ్రి రెసిడెన్షియల్ హౌసింగ్ ప్రాజెక్ట్‌లను నిర్వహించడంలో కీలక పాత్రం పోషించాడు. 1971లో కంపెనీని నియంత్రణలోకి తీసుకున్న తరువాత.. దానిని ట్రంప్ ఆర్గనైజేషన్‌గా మార్చేశారు. ఆ తరువాత వివిధ వ్యాపారాలలోకి ప్రవేశించారు.1973 నాటికి ట్రంప్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడిగా ట్రంప్ బ్రూక్లిన్, క్వీన్స్ & స్టాటెన్ ఐలాండ్‌లో 14,000 అపార్ట్‌మెంట్లను పర్యవేక్షించారు. 1978లో గ్రాండ్ సెంట్రల్ టెర్మినల్ పక్కనే గ్రాండ్ హయత్ హోటల్‌ను అభివృద్ధి చేయడం కూడా ఈయన సారథ్యంలోనే జరిగింది. 1983లో మిడ్‌టౌన్ మాన్‌హట్టన్‌లోని 58 అంతస్తుల 'ట్రంప్ టవర్'ను ట్రంప్ పూర్తి చేశారు. ఈయన కుటుంబానికి చెందిన పలువురు సభ్యులు కూడా ఈ భవనంలోనే నివసిస్తున్నట్లు తెలుస్తోంది.

వ్యాపార రంగంలో తనకంటూ ఓ ప్రత్యేకమైన స్థానం ఏర్పాటు చేసుకున్న ట్రంప్ 2016 అధ్యక్ష ఎన్నికల్లో గెలిచారు. అమెరికా అధ్యక్షుడిగా గెలిచిన తరువాత.. ట్రంప్ సంస్థలోని అన్ని నిర్వహణ బాధ్యతలకు రాజీనామా చేసి, కంపెనీ నిర్వహణను తన కుమారులు డోనాల్డ్ జూనియర్, ఎరిక్‌లకు అప్పగించారు. కాగా ఇప్పుడు మరోసారి అమెరికా అధ్యక్ష పదవి కోసం కమలా హరిస్‌తో పోటీ పడుతున్నారు.




# ధరల తగ్గుదలపై వరల్డ్ బ్యాంక్ క్లారిటీ

అంతర్జాతీయ మార్కెట్‌లలో వస్తువుల ధరలకు సంబంధించిన విషయాలను వరల్డ్ బ్యాంక్ తన అక్టోబర్ ఎడిషన్ కమోడిటీ మార్కెట్ ఔట్‌లుక్‌లో వెల్లడించింది. వస్తువుల ధరలు 2025లో 5 శాతం, 2026లో 2శాతం.. ఈ ఏడాది 3 శాతం క్షీణతను పొందుతాయని పేర్కొంది.క్రూడ్ ఆయిల్ ధరల విషయానికి వస్తే.. 2024లో బ్యారెల్ ధర 80 డాలర్లు కాగా, ఇది 2025లో 73 డాలర్లకు చేరుతుందని ప్రపంచ బ్యాంక్ వెల్లడించింది. 2026 నాటికి ఈ ధరలు 72 డాలర్లకు పడిపోతుందని కూడా స్పష్టం చేసింది. చమురు ధరలు గణనీయంగా తగ్గుతాయని వరల్డ్ బ్యాంక్ పేర్కొంది. మధ్యప్రాచ్యంలో జరుగుతున్న యుద్ధాలు ప్రమాదం అని హెచ్చరించింది.ఇంధన మార్కెట్లు భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలకు దగ్గరగా ఉంటాయి. కాబట్టి దీనివల్ల ధరలు పెరిగే అవకాశం ఉంది. 2023 అక్టోబర్ - 2024 ఏప్రిల్ మధ్య ప్రాంతీయ వైరుధ్యాల కారణంగా చమురు ధరలు 90 డాలర్లకు చేరింది. ప్రస్తుతం ఈ ధరలు కొంత శాంతించినప్పటికీ.. రాబోయే రోజుల్లో భౌగోళిక ఉద్రిక్తతలు దీనిపై ప్రభావం చూపే అవకాశం ఉందని తెలిపింది.చమురు ధరల విషయం పక్కన పెడితే.. లోహాల ధరలు 2025 - 26లలో తగ్గే సూచనలున్నాయి. బేస్ మెటల్ ధరలు 2026లో 3 శాతం మేర తగ్గుతాయి. అయితే వచ్చే ఏడాది ఈ ధరలు స్థిరంగా ఉంటాయని సమాచారం. బంగారం ధరల విషయానికి వస్తే.. 2024లో మార్కెట్లో బంగారం ధరలు భారీగా పెరిగాయి. దీనికి కారణం పెరిగిన భౌగోళిక రాజకీయ ఉద్రికత్తలు అని తెలుస్తోంది. అంతే కాకుండా సెంట్రల్ బ్యాంకుల నుంచి బలమైన డిమాండ్ కూడా ధరల పెరుగుదలకు ఆజ్యం పోస్తున్నాయి.

## సుజుకి హయబుసాకు రీకాల్: కారణం ఇదే..

భారతదేశంలో సుజుకి మోటార్‌సైకిల్ విక్రయిస్తున్న అత్యంత ఖరీదైన బైక్ 'హయబుసా'కు రీకాల్ ప్రకటించింది. రూ. 15 లక్షల కంటే ఎక్కువ ఖరీదైన బైకుకు కంపెనీ ఎందుకు రీకాల్ ప్రకటించింది, సమస్యను పరిష్కరించడానికి డబ్బు చెల్లించాల్సిన అవసరం ఉందా? అనే వివరాలు ఇక్కడ చూసేద్దాం.మూడవ తరం హయబుసాలలో బ్రేక్ సమస్య ఉన్నట్లు గుర్తించిన సుజుకి మోటార్‌సైకిల్ కంపెనీ స్వచ్ఛందంగానే రీకాల్ ప్రకటించింది. 2021 మార్చి - 2024 సెప్టెంబర్ మధ్య తయారైన సుమారు 1,056 బైకులలో ఈ సమస్య ఉన్నట్లు సమాచారం. ఇది బైక్ రైడర్లను ప్రమాదంలోకి నెడుతుంది.ఇప్పటి వరకు ఈ సమస్యకు సంబంధించిన పిర్యాదులు నమోదు కాలేదు. కానీ భవిష్యత్తులో ఈ సమస్య వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని భావించిన కంపెనీ ముందుగానే రీకాల్ ప్రకటించింది. త్వరలోనే దీనిని పరిష్కరిస్తుందని సమాచారం. దీనికోసం కస్టమర్ల నుంచి డబ్బు వసూలు చేయదు. ఈ సర్వీస్ పూర్తిగా ఉచితం.

# టయోటాకు సుజుకీ ఈవీలు.. గుజరాత్ ప్లాంటులో తయారీ

న్యూఢిల్లీ: పూర్తి స్థాయి ఎలక్ట్రిక్ ఎస్‌యూవీని టయోటా మోటార్ కార్పొరేషన్‌కు సుజుకీ మోటార్ కార్పొరేషన్ సరఫరా చేయనుంది. ఈ మేరకు ఇరు సంస్థలు తమ సహకారాన్ని మరింత విస్తరింపజేశాయి. ఈ మోడల్‌ను 2025 ప్రారంభంలో గుజరాత్ ప్లాంటులో తయారు చేయనున్నట్లు సుజుకీ మోటార్ కార్పొరేషన్ ఒక ప్రకటనలో తెలిపింది.మారుతీ సుజుకీ ఇండియా వచ్చే ఏడాది పూర్తి స్థాయి ఎలక్ట్రిక్ ఎస్‌యూవీని విడుదల చేయాలని యోచిస్తోంది. ఈ మోడల్ కోసం తీసుకున్న బీఈవీ యూనిట్, ప్లాట్‌ఫామ్‌లను సుజుకీ, టయోటాతోపాటు డైహట్సు మోటార్ కార్పొరేషన్ సంయుక్తంగా అభివృద్ధి చేశాయి.'ప్రపంచవ్యాప్తంగా టయోటాకు మా మొదటి బీఈవీ (బ్యాటరీ ఎలక్ట్రిక్ వెహికల్) సరఫరా చేస్తాం. ఈ విధంగా రెండు కంపెనీల మధ్య సహకారం మరింతగా కొనసాగినందుకు చాలా సంతోషంగా ఉంది. పోటీదారులుగా కొనసాగుతూనే ఇరు కంపెనీలు విభిన్న మార్గాల ద్వారా కార్బన్%-%న్యూట్రల్ సొసైటీని సాకారం చేయడంతో సహా సామాజిక సమస్యలను పరిష్కరించడంలో మరింత సహకరించుకుంటాయి" అని సుజుకీ ప్రెసిడెంట్ తోషిహిరో సుజుకీ తెలిపారు.ఉత్పత్తులను ఇచ్చిపుచ్చుకోవడం, తయారీ కేంద్రాల వినియోగానికై భాగస్వామ్యం కోసం టయోటా మోటార్ కార్పొరేషన్, సుజుకీ మోటార్ కార్పొరేషన్ 2017లో అవగాహన ఒప్పందంపై సంతకం చేశాయి. మారుతీ సుజుకీలో... సుజుకీ కార్పొరేషన్‌కు దాదాపు 58 శాతం వాటా ఉంది.





# ల్యాండ్ డీల్స్ జోరు.. టాప్‌లో హైదరాబాద్

న్యూఢిల్లీ: భారత రియల్ ఎస్టేట్ రంగంలో భూముల క్రయవిక్రయాలు ఈ ఏడాది జనవరి%-%సెప్టెంబర్‌లో భారీగా పెరిగాయి. రియల్ ఎస్టేట్ కన్సల్టెంట్ సీబీఆర్‌ఈ ప్రకారం.. 100 కంటే ఎక్కువ భూ ఒప్పందాలు జరిగాయి. ఈ ఒప్పందాల్లో భాగంగా సుమారు 1,700 ఎకరాలు చేతులు మారాయి. గతేడాది ఇదే కాలంలో 60 డీల్స్‌కుగాను 1,200 ఎకరాలు చేతులు మారాయి. డీల్స్ సంఖ్య పరంగా ఈ ఏడాది 65 శాతం వృద్ధి నమోదైంది. ల్యాండ్ డీల్స్‌లో ఆరు ప్రధాన భారతీయ నగరాలు ఢిల్లీ%-%ఎన్‌సీఆర్, ముంబై, చెన్నై, హైదరాబాద్, బెంగళూరు, పుణే ఆధిపత్యం చెలాయిస్తున్నాయి. ఈ ఏడాది జరిగిన ల్యాండ్ డీల్స్‌లో రెసిడెన్షియల్ 61 శాతం, ఇండస్ట్రియల్, లాజిస్టిక్స్ 13 శాతం, ఆఫీస్ విభాగం 8 శాతం నమోదయ్యాయి. విభిన్న రకాల ఆస్తులకు సంబంధించి పెరిగిన భూ ఒప్పంద కార్యకలాపాలు బలమైన పెట్టుబడిదారుల సెంటిమెంట్‌ను, భారతీయ రియల్ ఎస్టేట్ మార్కెట్ అభివృద్ధి చెందుతున్న తీరుతెన్నులను ప్రతిబింబిస్తున్నట్లు సీబీఆర్‌ఈ తెలియజేసింది. "రెసిడెన్షియల్, ఆఫీస్, డేటా సెంటర్ల వంటి అభివృద్ధి చెందుతున్న విభాగాలలో బలమైన వృద్ధిని చూస్తున్నాం. భారత రియల్ ఎస్టేట్ రంగం యొక్క దీర్ఘకాలిక అవకాశాలపై పెట్టుబడిదారులు మరింత నమ్మకంగా ఉన్నారనడానికి ఇది నిదర్శనం. ఈ ఆశావాదం భారత్‌ను రియల్ ఎస్టేట్ పెట్టుబడులకు వ్యూహాత్మక మార్కెట్‌గా నిలుపుతోంది. వివిధ మార్కెట్లలో బలమైన డిమాండ్, అనుకూల ఆర్థిక పరిస్థితులతో కలిపి వృద్ధికి అనుకూల వాతావరణాన్ని సృష్టించింది. మార్కెట్ స్థిరత్వం, దీర్ఘకాలిక వృద్ధి అవకాశాలను నొక్కి చెప్పే వ్యూహాత్మక పెట్టుబడుల ద్వారా ఈ ఊపు కొనసాగుతుందని ఆశిస్తున్నాం" అని సీబీఆర్‌ఈ వివరించింది.


# తస్మాత్ జాగ్రత్త! రియల్టీ సంస్థల నయా మోసం

## అధిక వడ్డీ పేరుతో పెట్టుబడుల సేకరణ

## 120 మంది నుంచి రూ.24 కోట్లు వసూలు

## నలుగుర్ని అరెస్టు చేసిన సైబరాబాద్ పోలీసులు

ప్రీలాంచ్, సాఫ్ట్ లాంచ్ పేర్లతో స్థిరాస్తి కొనుగోలుదారులు, పెట్టుబడిదారులను మోసం చేస్తున్న రియల్టీ సంస్థలు..తాజాగా బై బ్యాక్ స్కీమ్‌కు తెరలేపాయి. ముందస్తుగా కొంత మేర కంపెనీలో డిపాజిట్ చేస్తే ప్రతీ నెలా అధికంగా వడ్డీ చెల్లించడంతో పాటు కొంత స్థలం లీజు డీడ్ చేసిస్తామని మోసం చేయడం ఈ స్కీమ్ స్కామ్. తాజాగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన 120 మంది బాధితుల నుంచి రూ.24 కోట్లు వసూలు చేసి బిచాణా ఎత్తేశారు. స్క్వేర్స్ అండ్ యార్డ్స్ ఇన్‌ఫ్రా, యాడ్ అవెన్యూస్ కంపెనీలకు చెందిన నలుగురు ప్రతినిధులను సైబరాబాద్ ఆర్థిక నేరాల నియంత్రణ విభాగం (ఈఓడబ్ల్యూ) పోలీసులు అరెస్టు చేసి, జ్యూడీషియల్ రిమాండ్‌కు తరలించారు. డీసీపీ కె.ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం..ఏపీలోని చిలకలూరిపేటకు చెందిన బైర చంద్రశేఖర్, విజయవాడకు చెందిన వేములపల్లి జాన్సీ, రెడ్డిపల్లి కృష్ణ చైతన్య, ఎన్‌టీఆర్ జిల్లాలోని ఇబ్రహీంపట్నంకు చెందిన గరిమెల్ల వెంకట అఖిల్ నలుగురు కలిసి డైరెక్టర్లుగా పేర్కొంటూ కూకట్‌పల్లిలోని మంజీరా ట్రినిటీ మాల్‌లో స్క్వేర్స్ అండ్ యార్డ్స్ ఇన్‌ఫ్రా, యాడ్ అవెన్యూస్ పేర్లతో రెండు స్థిరాస్తి సంస్థలను ఏర్పాటు చేశారు. నెలకు అధిక వడ్డీ చెల్లిస్తామంటూ కస్టమర్లకు, పెట్టుబడిదారులకు ఆశ పెట్టారు. రూ.17 లక్షలు డిపాజిట్ చేస్తే వంద నెలల పాటు ప్రతీ నెలా రూ.20 వేల వడ్డీ చెల్లిస్తామని, అలాగే మహబూబ్‌నగర్ జిల్లాలోని తిరుమలగిరిలో 267 గజాల వ్యవసాయ భూమిని రిజిస్టర్ చేసి ఇస్తామని ఒప్పందం చేసుకున్నారు. అంతేకాకుండా ఈ భూమిలో శాండల్‌వుడ్ చెట్లను పెంచుతామని, 13%-%15 ఏళ్ల తర్వాత ఈ చెట్లను విక్రయించగా వచ్చిన సొమ్ములో 50 శాతం లాభాలను కూడా అందిస్తామని ఆశ పెట్టారు.బాధితులను నమ్మించేందుకు లీజు డీడ్ మెమోరాండమ్ ఆఫ్ అండర్ స్టాండింగ్ (ఎంఓయూ), చెక్‌లను అందించారు. కొన్ని నెలల పాటు వడ్డీ చెల్లించి, ఆ తర్వాత చెల్లించడం మానేశారు. వడ్డీలు చెల్లించకపోవడంతో కస్టమర్లు




ఆఫీసుకు రావడం మొదలుపెట్టారు. దీంతో నిందితులు కూకట్‌పల్లి నుంచి జూబ్లీహిల్స్‌కు కార్యాలయాన్ని మార్చి, తప్పించుకునేందుకు ప్రయత్నించారు. ఎట్టకేలకు కార్యాలయ జాడను బాధితులు పట్టేయడం, చెల్లించిన సొమ్ము తిరిగి ఇచ్చేయాలని ఒత్తిడి చేయడంతో నిందితులు రాత్రికి రాత్రే ఆఫీసుకు తాళం వేసి పరారయ్యారు. దీంతో కేపీహెచ్‌బీ కాలనీకి చెందిన అల్లం నాగరాజు ఫిర్యాదు మేరకు సైబరాబాద్ ఈఓడబ్ల్యూ ఠాణాలో తెలంగాణ ప్రొటెక్షన్ ఆఫ్ డిపాజిటర్స్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్%-%1999 కింద కేసులు నమోదు చేశారు. సాంకేతిక ఆధారాలతో నలుగురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు.కష్టపడి పొదుపు చేయాలకున్న సొమ్మును ఇలా ఎలాంటి నియంత్రణ ఆధ్వర్యంలోలేని కంపెనీల్లో పెట్టుబడి పెట్టి మోసపోకూడదని నిపుణులు సూచిస్తున్నారు. దీర్ఘకాలంలో మంచి రాబడులు ఇచ్చే ఈక్విటీ మార్కెట్లు, ఫిక్స్‌డ్ డిపాజిట్లు, రికరింగ్ డిపాజిట్లు, ఈటీఎఫ్..వంటివి ఎంచుకోవాలని చెబుతున్నారు. ప్రధానంగా ఎలాంటి నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలోని లేని కంపెనీలకు దూరంగా ఉండాలని సూచిస్తున్నారు.

# బడ్జెట్ ధరలో బెస్ట్ స్కూటర్లు: గొప్ప మైలేజ్ కూడా..

ప్రపంచంలో అతిపెద్ద టూ వీలర్స్ మార్కెట్లలో ఒకటైన భారత్‌లో.. ఎప్పటికప్పుడు సరికొత్త ద్విచక్ర వాహనాలు లాంచ్ అవుతూనే ఉన్నాయి. ఎన్ని కొత్త టూ వీలర్స్ లాంచ్ అయినా.. ప్రజలు మాత్రం ఎక్కువగా కొన్ని స్కూటర్లను మాత్రమే ఎంపిక చేసుకుని మరీ కొనుగోలు చేస్తున్నారు. ఈ దీపావళికి ఓ మంచి స్కూటర్ కొనాలనుకునే వారికి కూడా అలాంటివి బెస్ట్ ఆప్షన్ అనే చెప్పాలి.

**హోండా యాక్టివా**

భారతదేశంలో అత్యంత ప్రజాదరణ పొందిన స్కూటర్లలో హోండా యాక్టివా అగ్రగామి అనే చెప్పాలి. ఇది ఇప్పటికే మూడు కోట్లు కంటే ఎక్కువ అమ్మకాలను పొందగలిగింది. ప్రస్తుతం యాక్టివా 125, యాక్టివా 6జీ వంటి రూపాల్లో అందుబాటులో ఉంది






## టాప్-20 నుంచి కోహ్లి, రోహిత్ అవుట్

దుబాయ్: న్యూజిలాండ్‌తో జరిగిన టెస్టు సిరీస్‌లో భారత స్టార్స్ రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి ఘోరంగా విఫలం కావడంతో ఆ ప్రభావం వారిద్దరి ర్యాంకింగ్స్‌పై కూడా పడింది. బుధవారం విడుదలైన అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) టెస్టు బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో కోహ్లి, రోహిత్ శర్మ టాప్%-%20లో చోటు కోల్పోయారు. కోహ్లి ఎనిమిది స్థానాలు దిగజారి 22వ ర్యాంక్‌లో, రోహిత్ రెండు స్థానాలు పడిపోయి 26వ ర్యాంక్‌లో నిలిచారు. న్యూజిలాండ్‌తో జరిగిన మూడు టెస్టుల సిరీస్‌లో కోహ్లి 93 పరుగులు, రోహిత్ 91 పరుగులు సాధించడం గమనార్హం. మరోవైపు భారత్‌కే చెందిన యశస్వి జైస్వాల్ ఒక స్థానం పడిపోయి నాలుగో ర్యాంక్‌లో నిలువగా... రిషబ్ పంత్ ఐదు స్థానాలు మెరుగై ఆరో ర్యాంక్‌లోకి వచ్చాడు. శుబ్‌మన్ గిల్ నాలుగు స్థానాలు ఎగబాకి 16వ ర్యాంక్‌లో నిలిచాడు.

# కోట్లాభిషేకమే!

### భారత క్రికెటర్లకు జాక్‌పాట్ తగలనుందా?
### ఐపీఎల్ వేలంలో భారత క్రికెటర్లపై ఈసారి కాసుల వర్షం ఖాయం
### 2 కోట్ల రూపాయల కనీస ధరతో బరిలో 23 మంది భారత క్రికెటర్లు
### ఇటలీ నుంచి తొలిసారి ఒకరు వేలంలోకి




ముంబై: ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) మెగా వేలానికి సమయం దగ్గర పడుతున్న కొద్దీ ఆసక్తికర విషయాలు వెల్లడవుతున్నాయి. ఈ నెల 24, 25న సౌదీ అరేబియాలోని జిద్దా నగరం వేదికగా ఐపీఎల్%-%2025 వేలం జరగనుండగా... ఇందులో భారత్ నుంచి 23 మంది ప్లేయర్లు రూ. 2 కోట్ల కనీస ధరతో పాల్గొననున్నారు. రిషబ్ పంత్, కేఎల్ రాహుల్, శ్రేయస్ అయ్యర్ వంటి స్టార్ ఆటగాళ్లతో పాటు... చాలా రోజుల నుంచి జాతీయ జట్టుకు దూరమైన ఉమేశ్ యాదవ్, భువనేశ్వర్ కుమార్, నటరాజన్ వంటి వాళ్లు ఈ జాబితాలో ఉన్నారు. ముంబై ఇండియన్స్ బ్యాటర్ ఇషాన్ కిషన్‌తో పాటు స్పిన్ ఆల్‌రౌండర్ కృనాల్ పాండ్యా, వెంకటేశ్ అయ్యర్, దేవదత్ పడిక్కల్ కూడా తమ కనీస ధరను రెండు కోట్లుగా నమోదు చేసుకోవడం విశేషం.

శస్త్రచికిత్స అనంతరం తిరిగి కోలుకుంటున్న సీనియర్ పేసర్ మొహమ్మద్ షమీ, హైదరాబాద్ బౌలర్ మొహమ్మద్ సిరాజ్, హర్షదీప్ సింగ్, ముకేశ్ కుమార్, అవేశ్ ఖాన్, ఖలీల్ అహ్మద్, హర్షల్ పటేల్, దీపక్ చహర్, శార్దూల్ ఠాకూర్, హర్షల్ పటేల్, ప్రసిధ్ కృష్ణ, వాషింగ్టన్ సుందర్, అశ్విన్, యుజువేంద్ర చహల్ కూడా ఉన్నారు. మూడేళ్ల కోసం చేపడుతున్న ఈ మెగా వేలంలో మొత్తం 1574 మంది ప్లేయర్లు తమ పేర్లు నమోదు చేసుకున్నారు. కనీస ధర నిర్ణయించుకునే అవకాశం ఆటగాళ్లదే కాగా... ఒక్కో జట్టు గరిష్టంగా 25 మంది ప్లేయర్లను ఎంపిక చేసుకునే అవకాశం ఉంది.

**అండర్సన్ తొలిసారి...**

టెస్టు క్రికెట్‌కు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలనే ఉద్దేశంతో ఇంగ్లండ్ టెస్టు జట్టు సారథి బెన్ స్టోక్స్ ఈసారి ఐపీఎల్ వేలానికి దూరమయ్యాడు. కాగా అంతర్జాతీయ క్రికెట్‌కు ... రిటైర్మెంట్ ప్రకటించాడు. సుదీర్ఘ ఫార్మాట్‌లో అత్యధిక వికెట్లు పడగొట్టిన పేసర్‌గా రికార్డుల్లోకి ఎక్కిన అండర్సన్... టి20 మ్యాచ్ ఆడి ఇప్పటికే పదేళ్లు దాటిపోయింది. అండర్సన్ చివరిసారిగా 2014లో ఈ ఫార్మాట్‌లో మ్యాచ్ ఆడాడు.

అండర్సన్ తన కనీస ధరను రూ. 1 కోటీ 25 లక్షలుగా నిర్ణయించుకున్నాడు. గత వేలంలో అత్యధిక ధర (రూ. 24 కోట్ల 50 లక్షలు) పలికిన ప్లేయర్‌గా ఘనత సాధించిన ఆస్ట్రేలియా పేసర్ మిచెల్ స్టార్క్‌తో పాటు, మినీ వేలంలో అమ్ముడుపోని ఆస్ట్రేలియా ఆఫ్ స్పిన్నర్ నాథన్ లియాన్ రూ. 2 కోట్ల ప్రాథమిక ధరలో తమ పేర్లు నమోదు చేసుకున్నారు. 2023లో చివరిసారి ఐపీఎల్లో పాల్గొన్న ఇంగ్లండ్ పేసర్ జోఫ్రా ఆర్చర్ కూడా ఇదే ధరతో వేలంలో పాల్గొననున్నాడు.

**రూ. 75 లక్షలతో సర్ఫరాజ్**

గత వేలంలో అమ్ముడిపోని ఆటగాళ్ల జాబితాలో మిగిలిపోయిన ముంబై బ్యాటర్ సర్ఫరాజ్ ఖాన్‌తో పాటు... పేలవ ఫామ్‌తో ముంబై రంజీ జట్టులో చోటు కోల్పోయిన పృథ్వీ షా ఈసారి వేలంలో రూ. 75 లక్షల ప్రాథమిక ధరతో తమ పేర్లు నమోదు చేసుకున్నారు. వేలంలో పేర్లు నమోదు చేసుకున్న వారిలో 1165 మంది భారతీయ ప్లేయర్లు, 409 మంది విదేశీయులు ఉన్నారు. దక్షిణాఫ్రికా నుంచి అత్యధికంగా 91 మంది ప్లేయర్లు పోటీలో ఉండగా... ఆస్ట్రేలియా నుంచి 76 మంది, ఇంగ్లండ్ నుంచి 52 మంది, న్యూజిలాండ్ నుంచి 39 మంది, వెస్టిండీస్ నుంచి 33 మంది ప్లేయర్లు వేలంలో పాల్గొంటున్నారు. ఇటలీ, యూఏఈ నుంచి ఒక్కో ప్లేయర్ తమ పేరు నమోదు చేసుకున్నారు. ఇటలీ పేసర్ థామస్ డ్రాకా ఐపీఎల్ వేలంలో తన అదృష్టాన్ని పరీక్షించుకోనుండగా... ఈ ఏడాది టి20 ప్రపంచకప్ సందర్భంగా ఆకట్టుకున్న భారత సంతతికి చెందిన అమెరికా బౌలర్ సౌరభ్ నేత్రావల్కర్‌పై అందరి దృష్టి నిలవనుంది. ఐపీఎల్ వేలంలో పేరు నమోదు చేసుకున్న తొలి ఇటలీ ప్లేయర్‌గా డ్రాకా నిలిచాడు. ఇటలీ తరఫున ఇప్పటి వరకు నాలుగు అంతర్జాతీయ టి20 మ్యాచ్‌లు ఆడిన 24 ఏళ్ల డ్రాకా... గ్లోబల్ టి20 కెనడా టోర్నీ ద్వారా వెలుగులోకి వచ్చాడు. ఆ టోర్నీలో 11 వికెట్లు పడగొట్టిన డ్రాకా... ఆల్‌రౌండర్ల జాబితాలో ప్రాథమిక ధర రూ. 30 లక్షలతో ఐపీఎల్ వేలంలో తన పేరు నమోదు చేసుకున్నాడు. ఇటీవల ఐఎల్ టి20 లీగ్‌లో ముంబై ఇండియన్స్ ఫ్రాంచైజీకి చెందిన ముంబై ఎమిరేట్స్ జట్టుకు డ్రాకా ఎంపికయ్యాడు. ఇక అండర్%-%19 స్థాయిలో భారత్‌కు ప్రాతినిధ్యం వహించి ఆ తర్వాత మెరుగైన ఉపాధి కోసం అమెరికా వెళ్లి స్థిరపడి అక్కడ అటు ఉద్యోగంతో పాటు ఇటు క్రికెట్‌లో రాణిస్తున్న నేత్రావల్కర్ కూడా రూ. 30 లక్షల ప్రాథమిక ధరతో వేలానికి రానున్నాడు.



# ఓపెనర్‌గా రాహుల్!

### అనధికారిక టెస్టులో ప్రయోగం

### నేటి నుంచే భారత్ 'ఏ', ఆస్ట్రేలియా 'ఏ' రెండో మ్యాచ్

మెల్‌బోర్న్: ఆస్ట్రేలియా పర్యటన కంటే ముందే అక్కడకు వెళ్లిన టీమ్‌ఇండియా స్టార్ బ్యాటర్ కేఎల్ రాహుల్.. గురువారం నుంచి ప్రఖ్యాత మెల్‌బోర్న్ క్రికెట్ గ్రౌండ్ (ఎంసీజీ) వేదికగా ఆసీస్ 'ఏ'తో జరుగబోయే అనధికారిక రెండో టెస్టులో భారత ఇన్నింగ్స్‌ను ప్రారంభించనున్నాడు. ఈనెల 22 నుంచి కంగారూలతో తొలి టెస్టు జరగాల్సి ఉండగా ఆ మ్యాచ్‌కు సారథి రోహిత్ శర్మ అందుబాటులో ఉండేది అనుమానమేనన్న వార్తలు వస్తున్న నేపథ్యంలో యశస్వీ జైస్వాల్‌కు జంటగా రాహుల్‌ను ఆడించాలని టీమ్ మేనేజ్‌మెంట్ భావిస్తున్నట్టు తెలుస్తోంది.ఇందులో భాగంగానే రాహుల్‌ను ముందుగానే ఆస్ట్రేలియాకు పంపిన మేనేజ్‌మెంట్.. గురువారం మ్యాచ్‌లో అభిమన్యు ఈశ్వరన్‌తో కలిసి ఇన్నింగ్స్‌ను ఆరంభించే బాధ్యతలను రాహుల్‌కు అప్పజెప్పినట్టు సమాచారం. బంగ్లాదేశ్‌తో సిరీస్‌లో విఫలమైన రాహుల్.. న్యూజిలాండ్‌తో బెంగళూరు టెస్టులో ఆడినా ఆ మ్యాచ్‌లో విఫలమై తర్వాతి రెండు టెస్టులకూ బెంచ్‌కే పరిమితమయ్యాడు. ఈ నేపథ్యంలో అనధికారిక టెస్టులో అతడు ఏ మేరకు రాణించగలడు? అనేది ఆసక్తికరంగా మారింది. ఓపెనర్‌గా రావడం రాహుల్‌కు కొత్తేం కాదు. 2015-23 మధ్యకాలంలో 75 ఇన్నింగ్స్‌లలో ఓపెనర్‌గా వచ్చిన రాహుల్.. 34.94 సగటుతో 2,551 పరుగులు సాధించాడు. కేఎల్ రాహుల్‌తో పాటు ధ్రువ్ జురెల్ కూడా ఆస్ట్రేలియా పయనమవగా తొలి మ్యాచ్‌లో బాల్ టాంపరింగ్ ఆరోపణలు ఎదుర్కొన్న ఇషాన్ కిషన్ స్థానంలో అతడిని ఆడించే అవకాశాలున్నాయి.

**మార్పులు, చేర్పులతో**

ఆసీస్ 'ఏ'తో వామప్ మ్యాచ్ కోసం భారత్ 'ఏ' మార్పులు, చేర్పులతో బరిలోకి దిగే అవకాశం కనిపిస్తున్నది. బుధవారం ఎమ్‌సీజీలో జరిగిన నెట్ ప్రాక్టీస్‌లోరాహుల్ మంచి టచ్‌మీద కనిపించాడు. బాబా ఇంద్రజిత్ స్థానంలో రాహుల్ జట్టులోకి రానున్నాడు. మకాయ్‌లో జరిగిన తొలి మ్యాచ్‌లో రెండు ఇన్నింగ్స్‌లో ఇంద్రజిత్ 9, 6 స్కోర్లతో తీవ్రంగా నిరాశపరిచాడు.

దీనికి తోడు పేస్, బౌన్సీ పిచ్‌లపై 125కి.మీ వేగంతో కూడిన బంతులను ఆడటంలో ఇంద్రజిత్ తడబడ్డాడు. ఇషాన్ కిషన్‌కు బదులుగా జురెల్ రాక ఖరారు కాగా, పేసర్ సైనీ స్థానంలో ఖలీల్ తుది జట్టులో ఆడనున్నాడు. పెర్త్(22 తేదీ) పోరుకు ముందు భారత్ 'ఏ'కు ఇది కీలకం కానుంది.

# సఫారీలతో సై

### నేడు ఇరు జట్ల మధ్య తొలి టీ20
### సత్తాచాటేందుకు కుర్రాళ్లు తహతహ
### ప్రపంచకప్ ప్రతీకారం కోసం దక్షిణాఫ్రికా

**భారత్, దక్షిణాఫ్రికా మధ్య పొట్టిపోరుకు వేళయైంది. ఇరు జట్ల మధ్య నేటి నుంచి నాలుగు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌కు తెరలేవనుంది. ఇటీవల బంగ్లాదేశ్‌పై క్లీన్‌స్వీప్ విజయంతో టీమ్‌ఇండియా మంచి జోరుమీదుంటే..సొంతగడ్డపై**

**సత్తాచాటేందుకు సఫారీలు సై అంటున్నారు. టీ20 ప్రపంచకప్ పరాజయానికి ప్రతీకారం తీర్చుకునేందుకు దక్షిణాఫ్రికా పట్టుదలతో ఉంది. టీమ్‌ఇండియాపై ఆధిపత్యం ప్రదర్శించేందుకు పావులు కదుపుతున్నది.**

**మరోవైపు కుర్రాళ్లతో కళకళలాడుతున్న సూర్యకుమార్‌సేన సత్తా చాటాలని చూస్తున్నది. అవకాశాలను అందిపుచ్చుకుంటూ అదరగొట్టేందుకు కుర్రాళ్లు కసిమీదున్నారు. ఇటీవలే సొంతగడ్డపై టెస్టుల్లో కివీస్ చేతిలో ఎదురైన దారుణ పరాభవాన్ని మరిపించేందుకు భారత్ సమిష్టి ప్రదర్శనతో కదంతొక్కనుంది. భారీ స్కోర్లకు వేదికైన డర్బన్‌లో ఇరు జట్ల మధ్య ఆసక్తికర పోరు జరిగే అవకాశముంది.**

డర్బన్: ప్రపంచంలో రెండు అత్యుత్తమ జట్ల మధ్య పొట్టి పోరు అభిమానులను అలరించబోతున్నది. డర్బన్ వేదికగా శుక్రవారం తొలి టీ20 పోరు జరుగనుంది. 2026 సొంత ఇలాఖాలో జరుగనున్న పొట్టి ప్రపంచకప్ నాటికి పటిష్ఠ జట్టును తీర్చిదిద్దేందుకు టీమ్‌ఇండియా వ్యూహాలు రచిస్తున్నది. ఇందులో భాగంగా సూర్యకుమార్ యాదవ్ నేతృత్వంలో..దేశవాళీ, ఐపీఎల్‌లో మెరుపులు మెరిపిస్తున్న కుర్రాళ్లకు జాతీయ జట్టులో అవకాశం కల్పించింది. అవకాశాలను అందిపుచ్చుకుంటూ ఇప్పటికే రింకూసింగ్, అర్ష్‌దీప్‌సింగ్, తిలక్‌వర్మ, రవిబిష్ణోయ్ లాంటి సత్తాచాటుతున్నారు.అయితే రోహిత్‌శర్మ, విరాట్‌కోహ్లీ లాంటి దిగ్గజాల వెలితి ఏమాత్రం కనిపించకుండా కుర్రాళ్లు దుమ్మురేపుతున్నారు. బంగ్లాతో చివరి మ్యాచ్‌లో ధనాధన్ సెంచరీతో సీనియర్ బ్యాటర్ సంజూ శాంసన్ ఫామ్‌లోకి రాగా, మరో ఓపెనర్ అభిషేక్‌శర్మ ఫామ్ టీమ్ మేనేజ్‌మెంట్‌ను ఆందోళన కల్గిస్తున్నది. శాంసన్‌కు తోడు అభిషేక్ టచ్‌లోకి వస్తే..టీమ్‌ఇండియాను ఆపడం సఫారీలకు కష్టమే. వీరికి సీనియర్లు సూర్యకుమార్, హార్దిక్‌పాండ్యా, అక్షర్‌పటేల్ అండగా ఉన్నారు. కెరీర్ మొదట్లో తన దూకుడైన బ్యాటింగ్‌తో ఆకట్టుకున్న తిలక్‌వర్మ ఈ మధ్య స్థాయికి తగ్గ ప్రదర్శన కనబర్చడం లేదు. సఫారీలతో ఈ సిరీస్‌లోనైనా తిలక్ ఫామ్‌లోకి రావాలని అభిమానులు ఆశిస్తున్నారు. బౌలింగ్ విషయానికొస్తే..అర్ష్‌దీప్‌సింగ్ నాయకత్వం వహిస్తుండగా, అవేశ్‌ఖాన్, యశ్ దయాల్, వైశాఖ్ ఇంకా పరిణతి సాధించాల్సి ఉంది.

**సత్తాచాటాలని:**

సొంతగడ్డపై పరిస్థితులను అనుకూలంగా మలుచుకుంటూ సత్తాచాటాలని సఫారీలు సిద్ధంగా ఉన్నారు. కెప్టెన్ మార్క్మ్ ఫామ్‌లో లేకపోవడం జట్టుకు లోటుగా కనిపిస్తున్నది. ఈ ఏడాది ఆడిన 14 ఇన్నింగ్స్‌లో మార్క్మ్ ఒకే సారి 25 పరుగుల మార్క్ దాటాడు. దీనికి తోడు ప్రపంచకప్ ఆడిన క్వింటన్‌డికాక్, రబాడ, నోకియా, శంసీ లేకుండా భారత్‌కు ఏమాత్రం పోటీనిస్తుందనేది ఆసక్తికరంగా మారింది.



## బ్యాడ్మింటన్ అకాడమీకి పీవీ సింధు భూమి పూజ




**అమరావతి, నవంబర్ 7 (ఆర్ఎన్ఎ) :** విశాఖలో బ్యాడ్మింటన్ అకాడమీకి స్టార్ ప్లేయర్ పీవీ సింధు భూమి గురువారం పూజ చేశారు. ప్రభుత్వం కేటాయించిన స్థలంలో అకాడమీ నిర్మాణానికి తన తల్లిదండ్రులతో కలిసి గురువారం ఉదయం భూమి పూజ చేశారు. పనులు త్వరగా చేపట్టి ఏడాదిలోగా నిర్మాణం పూర్తి చేయనున్నట్లు ఈ సందర్భంగా పీవీ సింధు తెలిపారు. ఈ భూమి విషయంలో ఎలాంటి వివాదం లేదని.. ప్రభుత్వం అన్ని అనుమతులు ఇచ్చినట్లు వివరించారు. ఈ అకాడమీ ద్వారా ఎంతో మంది క్రీడాకారులను తయారు చేస్తామని ఈ సందర్భంగా పేర్కొన్నారు. అకాడమీకి సంబంధించిన అన్ని వివరాలూ త్వరలోనే వెల్లడిస్తామని ఈ సందర్భంగా పీవీ సింధు వెల్లడించారు. గత వైసీపీ ప్రభుత్వం పీవీ సింధుకు విశాఖపట్నంలోని పెదగదిలి కూడలి సమీపంలో భూమి కేటాయించిన విషయం తెలిసిందే.

# గత జగన్ దుర్మార్గ పాలన వల్ల రాష్ట్రం వెనుకబాటు

## ఐదేళ్లు చేసిన పాపాల వల్ల ప్రజలకు తీవ్ర ఇబ్బందులు

## విద్యుత్ ఉప కేంద్రాన్ని ప్రారంభించిన సీఎం చంద్రబాబు



**అమరావతి(క్రైమ్ మిర్రర్):** ఐదేళ్లు సీఎంగా జగన్ చేసిన పాపాలతో నేడు ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తోందని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. గురువారం రాజధాని అమరావతి ప్రాంతంలో పర్యటించిన ఆయన తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం గ్రామంలో నిర్మించిన విద్యుత్ ఉపకేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. జగన్ దుర్మార్గ పాలనతో రాష్ట్రం వెనకబడిందన్నారు. వైసీపీ పాపాలకు జనం బలవుతున్నారన్నారు. జగన్ చేసిన పాపాలకు బదులుగా ఓటర్లు ఎన్నికల్లో వాతలు పెట్టి ఇంటికి పంపించారన్నారు. దుర్మార్గులకు అధికారం ఇవ్వడమే ప్రజలు చేసిన తప్పన్నారు. కేంద్రం ఇచ్చిన నిధులను గత వైసీపీ ప్రభుత్వం దారి మళ్లించిందని, దీంతో కేంద్రం నిధులు ఇవ్వని పరిస్థితిని తీసుకొచ్చారన్నారు. పోలవరం డయాఫ్రమ్ వాల్‌ను నాశనం చేశారని చంద్రబాబు విమర్శించారు. జగన్ అరాచక పాలనతో పోలవరం వెనక్కి వెళ్లిందన్నారు. రాష్ట్రంలో రహదారులను గోతుల మయం చేశారన్నారు. అభివృద్ధిని పక్కనపెట్టి గత వైసీపీ ప్రభుత్వం ప్రజల సొమ్మును దోచుకుందని ఆరోపించారు. తాను సీఎంగా బాధ్యతలు చేపట్టిన తర్వాత నుంచి విద్యుత్తు ఛార్జీలు పెరగవని తాను హామీ ఇస్తున్నట్లు తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వం చేసిన తప్పుల కారణంగానే ఇటీవల విద్యుత్తు ఛార్జీలు పెరిగాయన్నారు. అభివృద్ధి పనులకు శ్రీకారం.. రాజధాని ప్రాంతం అభివృద్ధి కోసం 400 కేవీ విద్యుత్ సరఫరా లైన్లు శాశ్వత మళ్లింపు పనులను ముఖ్యమంత్రి ప్రారంభించారు. రాష్ట్రంలో అంతరాయం లేకుండా నిరంతర విద్యుత్ సరఫరా అందించేదుకు రూ.505 కోట్లతో నిర్మించిన జీఐఎస్ విద్యుత్ సబ్ స్టేషన్‌ను చంద్రబాబు ప్రారంభించడంతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా రూ. 5407 కోట్లతో నిర్మించిన సబ్ స్టేషన్లకు వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. ఎన్టీఆర్ జిల్లా, గుంటూరు, చిత్తూరు, నంద్యాల, శ్రీ సత్య సాయి, శ్రీకాకుళం, అనకాపల్లి, కృష్ణా, ప్రకాశం, తిరుపతి, కడప జిల్లాల్లో విద్యుత్ సబ్ స్టేషన్లను సీఎం చంద్రబాబు చేతుల మీదుగా వర్చువల్‌గా ప్రారంభించారు. సీఆర్డీయే పరిధిలో భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా తాళ్ళాయాపాలెంలో 400 కేవీ విద్యుత్తు సబ్‌స్టేషన్‌ను నిర్మించారు. ఆర్థిక అభివృద్ధి సాధించడంలో 24.7 గంటలు విద్యుత్ సరఫరా కీలక పాత్ర పోషించనుంది. రాజధాని ప్రాంతాన్ని అభివృద్ధి చేసేందుకు కూటమి ప్రభుత్వం క్రమక్రమంగా అడుగులు ముందుకు వేస్తోంది. ఇందులో భాగంగా రాజధాని ప్రాంతంలో తాళ్లాయపాలెంలో 400/220 కెవి గ్యాస్ ఇన్సులేటెడ్ విద్యుత్ ఉపకేంద్రాన్ని సర్కార్ నిర్మించింది. ఈ కేంద్రాన్ని ట్రాన్స్‌మిషన్ కార్పొరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ లిమిటెడ్ తాళ్లాయపాలెంలో ఏర్పాటు చేసింది. ఇప్పటి వరకు రాజధాని ప్రాంతానికి 220/132/33కేవీ తాడికొండ కేంద్రం నుంచి కరెంట్ సరఫరా అవుతోంది. ప్రస్తుతం నిర్మించిన 400/220 విద్యుత్ కేంద్రంతో పాటు నేలపాడులో 220/33 కేవీ విద్యుత్ కేంద్రాన్ని కూడా నిర్మించాలని సర్కార్ నిర్ణయించింది. వీటి ద్వారా రాజధాని ప్రాంతంలోని అన్ని ప్రాంతాలకు విద్యుత్ సరఫరా అవుతుంది.

## సెంట్రల్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ చీఫ్‌గా కశ్యప్ పటేల్

### కీలక పదవి అప్పగించేందుకు ట్రంప్ ప్రయత్నాలు



**న్యూఢిల్లీ, (క్రైమ్ మిర్రర్):** సెంట్రల్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ చీఫ్‌గా కశ్యప్ పటేల్‌కు అవకాశం దక్కనున్నది. అమెరికా కొత్త అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్.. భారతీయ సంతతికి వ్యక్తికి ఆ కీలక పదవిని అప్పగించే ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ట్రంప్ కోసం ఏపని అయినా చేసేందుకు కశ్యప్ సిద్ధంగా ఉన్నారు. అయితే కశ్యప్ పటేల్‌కు గుజరాతీ మూలాలు ఉన్నాయి. ఈస్ట్ ఆఫ్రికాలో ఆయన పేరెంట్స్ పెరిగారు. 1970 దశకంలో ఆయన తండ్రి ఉగాండా నుంచి వలస వచ్చారు. 1980లో న్యూయార్క్ గార్డెన్ సిటీలో ఆయన జన్మించారు. హిందువుగా ఆయన పెరిగారు. వర్ణ వివక్షకు వ్యతిరేకంగా ఆయన పోరాడారు. రిచ్‌మండ్ యూనివర్సిటీలో ఆయన గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు. న్యూయార్క్‌లో లా డిగ్రీ చదివారు. యూకేలోని యూనివర్సిటీ కాలేజీ లండన్ ఫాకల్టీ ఆఫ్ లాస్ నుంచి ఇంటర్నేషనల్ లా సర్టిఫికేట్ పొందారు. రక్షణశాఖ మాజీ కార్యదర్శి క్రిస్టోఫర్ మిల్లర్ వద్ద పనిచేశారు. నేషనల్ సెక్యూర్టీ కౌన్సిల్‌లో కౌంటర్ టెర్రరిజం సీనియర్ డైరెక్టర్‌గా చేశారు. గతంలో డోనాల్డ్ ట్రంప్ ప్రభుత్వ సమయంలో.. ఐసిస్, ఆల్‌ఖయిదా కీలక నేతల హత్యలకు మిషన్ నడిపించారు. హౌజ్ కమిటీకి చెందిన ఇంటెలిజెన్స్‌కు నేషనల్ సెక్యూర్టీ అడ్వైజర్‌గా చేశారు. 2016 ఎన్నికల్లో రష్యా ప్రమేయంపై విచారణాధికారిగా చేశారు. లాయర్‌గా అనేక కేసుల్ని వాదించారు. హత్యలు, నార్కో ట్రాఫికింగ్, ఆర్థిక నేరాల గురించి ఫెడరల్ కోర్టుల్లో వాదించారు. 2019లో ట్రంప్ టీంలో కశ్యప్ పటేల్ చేరినట్లు ఓ రిపోర్టు ద్వారా తేలింది. గత పాలన సమయంలో సీఏఐ డిప్యూటీ డైరెక్టర్‌గా కశ్యప్ పటేల్‌ను నియమించాలని ట్రంప్ ప్లాన్ వేసినట్లు తెలిసింది.

## ఏపీ డిప్యూటీ సీఎం సర్పంచ్ సంఘాలతో సమావేశం

### వాలంటీర్లకు మేలు కూటమి ప్రభుత్వం మేలు చేస్తుంది



**అమరావతి, (క్రైమ్ మిర్రర్):** ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అమరావతిలో సర్పంచ్ సంఘాలతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా వాలంటీర్ల వ్యవస్థపై ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. వాలంటీర్ వ్యవస్థను రద్దు చేయాలన్న సర్పంచుల విజ్ఞప్తిపై ఆయన స్పందించారు. వాలంటీర్లకు మేలు చేయాలనే ఆలోచలతోనే కూటమి ప్రభుత్వం ఉందన్నారు. కానీ, గత ప్రభుత్వం వారిని మోసం చేసిందని తెలిపారు. వాళ్లు ఉద్యోగంలో ఉంటే రద్దు చేయవచ్చు.. కానీ వాళ్లు అసలు వ్యవస్థలోనే లేరు.. ఇదో సాంకేతిక సమస్య అని ఆయన మాట్లాడారు.

## మద్యం షాపును ముట్టడించిన మహిళలు

**గుంటూరు, (క్రైమ్ మిర్రర్):** గుంటూరులో మహిళలు మద్యం షాపును ముట్టడించారు. మణీ హొటల్ సెంటర్‌లో ఇళ్ల, ప్రార్థన మందిరాల మధ్య మద్యం షాపు ఉండటంతో స్థానిక మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయంపై మద్యం షాపు నిర్వాహకులకు పలు మార్లు చెప్పిన పట్టించుకోలేదు. సమస్యను ఎక్సైజ్ సిబ్బందికి తీసుకెళ్లిన ప్రజల అభ్యర్థనను వారు లెక్కచేయనట్లు తెలుస్తుంది. ఇక విసుగు చెందిన స్థానిక మహిళలు మద్యం షాపును ముట్టడించారు. ఈ నేపథ్యంలో మహిళలు, మద్యం షాపు నిర్వాహకులకు మధ్య వాగ్వాదం జరిగింది. మద్యం షాపు అక్కడి నుండి తీసివేయాలని మహిళలు పెద్ద ఎత్తన ఆందోళన చేశారు. వారిపై మద్యం షాపు నిర్వాహకులు దురుసుగా ప్రవర్తించారు. కాగా, ఏపీలోని కొన్ని ప్రాంతాల్లో కొత్త లిక్కర్ షాపులు ప్రారంభమైన సంగతి తెలిసిందే. ప్రభుత్వం ప్రకటించిన లిక్కర్ పాలసీకి అనుగుణంగా అమ్మకాలు జరగడమే కాకుండా తిరిగి బ్రాండెడ్ అమ్మకాలు అందుబాటులోకి వచ్చాయి. అయితే, కొన్ని షాపులు ఇళ్లు, గుడులు, ప్రార్థన మందిరాల మధ్య ఉండటంతో స్థానిక మహిళలు నిరసనలు తెలుపుతున్నారు. తమ ప్రాంతంలో మద్యం షాపులు వద్దంటూ ఆందోళనకు దిగుతున్నారు.

## బెంగళూరులో బ్రిటన్ మాజీ ప్రధాని సందడి




**బెంగళూరు,(క్రైమ్ మిర్రర్):** బ్రిటన్ మాజీ ప్రధాని, భారత సంతతికి చెందిన రిషి సునాక్ బెంగళూరులో మెరిశారు. తన భార్య అక్షతా మూర్తితో కలిసి ఓ కాఫీ షాప్‌లో సందడి చేశారు. స్థానికులతో ఫొటోలు, సెల్ఫీలు దిగుతూ ఆకట్టుకున్నారు. రిషి సునాక్, ఆయన భార్య అక్షతా మూర్తి ఇటీవలే బెంగళూరులోని థర్డ్ వేవ్ కాఫీ షాప్‌లో కాఫీ డేట్‌ను ఆస్వాదించారు. ఇద్దరూ టేబుల్ వద్ద కాఫీని ఎంజాయ్ చేస్తూ సరదాగా కబుర్లు చెప్పుకుంటూ కనిపించారు. ఆ సమయంలో కాఫీ షాప్‌కు వెళ్లిన స్థానికులు రిషి సునాక్ జంటను చూసి థ్రిల్ అయ్యారు. వారితో ఫొటోలు, సెల్ఫీలు దిగేందుకు ఎగబడ్డారు. ఇందుకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు నెట్టింట వైరల్‌గా మారాయి. కాగా, రిషి సునాక్ 2022 నుంచి 2024 వరకు యూకే ప్రధాన మంత్రిగా పనిచేసిన విషయం తెలిసిందే. ఇటీవలే జరిగిన ఎన్నికల్లో రిషి సునాక్ పార్టీ ఓటమి చవి చూసింది. ఇన్ఫోసిస్ సంస్థ వ్యవస్థాపకుడు నారాయణమూర్తి, సుధామూర్తి కుటుంబం గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఎంతో విజయవంతంగా ఓ సాఫ్ట్‌వేర్ సంస్థను నడుపుతున్నప్పటికీ సాదాసీదా జీవితాన్ని గడుపుతుంటారు. వీరి కుమార్తె అక్షతా మూర్తి. అక్షత.. రిషి సునాక్‌కు ప్రేమ వివాహం చేసుకుంది. రిషి యూకే ప్రధానిగా ఉన్న సమయంలో అక్షతా మూర్తి బెంగళూరు వీధుల్లో తన తండ్రితో కలిసి షాపింగ్ చేసిన విషయం తెలిసిందే.

### విజయవాడలో రైతుల ఇంటికి స్వయంగా వెళ్లిన

## ఏపీ మున్సిపల్ శాఖ మంత్రి

### ల్యాండ్ పూలింగ్‌పై అనుమానాలు నివృత్తి చేసేందుకు కార్యకమ్రం



**విజయవాడ, (క్రైమ్ మిర్రర్):** విజయవాడలో ఏపీ మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ గురువారం పర్యటించారు. అమరావతి ల్యాండ్ పూలింగ్ అనుమానాలను నివృత్తి చేసేందుకు ఆయన రైతుల ఇళ్లకు స్వయంగా వెళ్లారు. విజయవాడలోని రాజధాని రైతు అనుమోల్ గాంధీ నివాసానికి మంత్రి వెళ్లారు. ఇప్పటికే రాజధాని గ్రామాల్లో పలువురు రైతుల ఇళ్లకు స్వయంగా వెళ్లి పూలింగ్ అంగీకార పత్రాలను స్వీకరించారు. అయితే.. ఇప్పటి వరకు భూములు ఇవ్వని రైతుల ఇళ్లకు వెళ్లిన మంత్రి.. ల్యాండ్ పూలింగ్‌కు సంబంధించి వివరాలను వెల్లడిస్తున్నారు. గతంలో పలు అనుమానాలు, భయాలతో పలువురు రైతులు రాజధాని అమరావతికి భూములు ఇవ్వలేదు. వారి వల్ల రాజధాని డిజైనింగ్, నిర్మాణాలకు కొంత మేర ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడిన నేపథ్యంలో స్వయంగా మంత్రి నారాయణ రంగంలోకి దిగారు. భూములు ఇవ్వకుండా భయంతో, అనుమానాలతో ఉన్న రైతుల ఇళ్లకు మంత్రి నారాయణ వెళ్లి అన్నదాతలను కలుస్తున్నారు. ల్యాండ్ పూలింగ్, రాజధాని నిర్మాణం ఆవశ్యకతను వివరిస్తున్నారు. ప్రస్తుతం విజయవాడలో ఉన్న రాజధాని రైతు అనుమోల్ గాంధీ నివాసానికి మంత్రి వెళ్లి కలిశారు. రాజధాని అమరావతి ప్రాముఖ్యత, రాజధాని నిర్మాణం ఆవశ్యకతపై వివరించి.. రాజధానికి ఇవ్వాల్సిన భూములు ఇవ్వాలని వినతి చేశారు. ఇక ఇప్పటికే రాజధాని గ్రామాల్లో ఇప్పటి వరకు భూములు ఇవ్వని రైతుల ఇళ్లకు వెళ్లి పలువురిని స్వయంగా కలిసి... రాజధానికి భూములు ఇచ్చి రాజధాని నిర్మాణానికి సహకరించాలని నారాయణ చేస్తున్న ప్రయత్నాలు ఫలిస్తున్నట్లుగా తెలుస్తోంది. గత పదేళ్ల పాటు భూములిచ్చేందుకు నిరాకరించిన రైతులు ఇప్పుడు కాస్త మెత్తబడుతున్నట్లు సమాచారం. మంత్రి నారాయణ స్వయంగా ఇంటికెళ్లి.. భూముల విషయంలో ఆయన అడిగిన తీరుకు కొంతమంది రైతులు మెత్తబడి భూములు ఇచ్చేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. మంత్రి నారాయణ చేస్తున్న ఈ ప్రయత్నం పూర్తి స్థాయిలో సక్సెస్ అయితేనే రాజధాని నిర్మాణం వేగవంతం అవుతుంది.

## కొడుకుతో కలిసి తల్లి, సోదరి హత్య

**భువనేశ్వర్, (క్రైమ్ మిర్రర్):** ఆస్తి కోసం ఒక వ్యక్తి దారుణానికి పాల్పడ్డాడు. కొడుకుతో కలిసి వృద్ధురాలైన తల్లి, సోదరిని హత్య చేశాడు. అగ్నిప్రమాదంలో వారు చనిపోయినట్లు నమ్మించేందుకు ప్రయత్నించాడు. అయితే పోలీసుల దర్యాప్తులో అసలు విషయం తెలియడంతో నిందితులు అరెస్ట్ అయ్యారు. ఒడిశాలోని సంబల్‌పూర్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. నవంబర్ 5న రాత్రి వేళ హటాపాడా ప్రాంతంలోని బిల్డింగ్ మొదటి అంతస్తులో మంటలు, పొగలు రావడాన్ని స్థానికులు గమనించారు. ఈ సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకున్నారు. అక్కడ నివసిస్తున్న 90 ఏళ్ల స్నేహలత దీక్షిత్, ఆమె కుమార్తె అయిన 62 ఏళ్ల సాయిరేంద్రి దీక్షిత్ కాలిన మృతదేహాలను గుర్తించారు. అసహజ మరణంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కాగా, ఆస్తి తగాదాల నేపథ్యంలో పక్కా ప్లాన్‌తో ఇద్దరు మహిళల హత్య జరిగినట్లు పోలీసులు తెలుసుకున్నారు. స్నేహలత దీక్షిత్ కుమారుడు జగన్నాథ్ తన కుమారుడు సంకేత్‌తో కలిసి తల్లి, సోదరి గొంతునొక్కి హత్య చేశారని పోలీస్ అధికారి తెలిపారు. ఆ తర్వాత వారి మృతదేహాలకు నిప్పుపెట్టి అగ్నిప్రమాదంలో చనిపోయినట్లుగా నమ్మించేందుకు ప్రయత్నించారని చెప్పారు. స్నేహలత చిన్న కూతురు ఇంద్రాణి ఫిర్యాదు ఆధారంగా హతురాలి కొడుకు, మనవడ్ని అరెస్ట్ చేసినట్లు వెల్లడించారు.

## నామినేషన్ వేసిన ఓ నేతను కాంగ్రెస్ పార్టీ సస్పెండ్

**జైపూర్, (క్రైమ్ మిర్రర్):** ఉప ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేసిన ఓ నేతను కాంగ్రెస్ పార్టీ సస్పెండ్ చేసింది. రాజస్థాన్‌లో ఖాళీగా ఉన్న అసెంబ్లీ స్థానాలకు ఈనెల 13న ఉప ఎన్నికలు జరగనున్న విషయం తెలిసిందే. అయితే, ఈ ఎన్నికల్లో డియోలి-ఉనియారా అసెంబ్లీ స్థానం నుంచి నరేష్ మీనాకు కాంగ్రెస్ పార్టీ టికెట్ నిరాకరించింది. అక్కడ కేసీ మీనాను బరిలోకి దింపింది. దీంతో తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన నరేష్ మీనా స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. దీంతో ఆగ్రహానికి గురైన హస్తం పార్టీ నరేష్ మీనాపై సస్పెండ్ వేటు వేసింది. కాగా, రాజస్థాన్‌లోని ఖాళీగా ఉన్న మొత్తం 7 అసెంబ్లీ స్థానాలకు ఉప ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఎన్నికల సంఘం ఇటీవలే ప్రకటించిన విషయం తెలిసిందే. జుంఝును, దౌసా, డియోలి-ఉనియారా, ఖిన్వ్‌సర్, చోరాసి, సాలంబెర్, రామ్‌గఢ్ స్థానాలకు ఈనెల 13న ఎన్నికలు నిర్వహించనుంది. నవంబర్ 23న ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలు వెల్లడించనున్నారు.

## ఆలయంలో రూ.78 లక్షల విలువైన బంగారు నగలను చోరీ

**అహ్మదాబాద్,(క్రైమ్ మిర్రర్):** పురాతన ఆలయంలో చోరీ జరిగింది. అమ్మవారికి చెందిన రూ.78 లక్షల విలువైన బంగారు నగలను ఒక వ్యక్తి దొంగిలించాడు. ఫిర్యాదు అందుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. సీసీటీవీ ఫుటేజ్‌ను పరిశీలించి నిందితుడ్ని అరెస్ట్ చేశారు. గుజరాత్‌లోని పంచమహల్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. అక్టోబర్ 28న పావగఢ్ కొండలపై ఉన్న పురాతన మహాకాళి దేవి ఆలయంలో చోరీ జరిగింది. ఆలయం గర్భగుడిలోకి ప్రవేశించిన దొంగ రూ. 78 లక్షల విలువైన ఆరు బంగారు హారాలు, బంగారు పూతపూసిన రెండు వస్తువులు అపహరించాడు. కాగా, ఆలయ సిబ్బంది నుంచి ఫిర్యాదు అందుకున్న పోలీసులు ఈ చోరీపై స్పందించారు. గుడితో పాటు పరిసర ప్రాంతాల్లోని 150కుపైగా సీసీటీవీల ఫుటేజ్‌ను పరిశీలించారు. దొంగతనం ముందు రోజు ఒక వ్యక్తి బైక్‌పై అనుమానాస్పదంగా ఆలయం వద్ద సంచరించడాన్ని గమనించారు. సూరత్‌కు చెందిన విదుర్‌భాయ్ వాసవగా గుర్తించారు. అక్కడికి వెళ్లిన పోలీసులు ఇంటి నుంచి నిందితుడ్ని అరెస్ట్ చేశారు. చోరీ చేసిన ఆలయ ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు.



# ఆర్ఆర్ఆర్‌కు అరుదైన గౌరవం

'ఆర్ఆర్ఆర్' సినిమాకు అరుదైన గౌరవం లభించింది. దాదాపు 150 సంవత్సరాల చరిత్ర కలిగిన లండన్‌లోని ఐకానిక్ రాయల్ ఆల్బర్ట్ సినిమా హాల్‌లో 'ఆర్ఆర్ఆర్' చిత్రం ప్రదర్శితం కానుంది. వచ్చే ఏడాది మే 11న ఈ మూవీ స్క్రీనింగ్ ఉంటుందని 'ఆర్ఆర్ఆర్' యూనిట్ ప్రకటించింది. అలాగే ఈ కార్యక్రమంలో రాయల్ ఫిల్ హార్మోనిక్ ఆర్కెస్ట్రాతో 'ఆర్ఆర్ఆర్' చిత్ర సంగీత దర్శకుడు ఎమ్ఎమ్ కీరవాణి లైవ్ కన్సర్ట్ ఇవ్వనున్నారు. కాగా ఎన్టీఆర్, రామ్‌చరణ్ హీరోలుగా రాజమౌళి దర్శకత్వంలో రూపొందిన 'ఆర్ఆర్ఆర్' సినిమా 2022 మార్చి 25న విడుదలై బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. 95వ ఆస్కార్ అవార్డ్స్‌లో 'బెస్ట్ ఒరిజినల్ సాంగ్' విభాగంలో (నాటు నాటు పాటకు గాను) ఎమ్ఎమ్ కీరవాణి, లిరిక్ రైటర్ చంద్రబోస్ ఆస్కార్ అవార్డులు అందుకున్న సంగతి తెలిసిందే. పలు అంతర్జాతీయ, జాతీయ అవార్డులు కూడా లభించాయి. కాగా ప్రభాస్ హీరోగా రాజమౌళి దర్శకత్వం వహించిన 'బాహుబలి: ది కన్‌క్లూజన్' సినిమా ఐకానిక్ రాయల్ ఆల్బర్ట్ హాల్‌లో 2019లో ప్రదర్శితమైన విషయం తెలిసిందే.



# రకుల్ ప్రీత్ సింగ్‌పై దారుణమైన ట్రోలింగ్..! ఇంతకీ ఏం జరిగిందంటే..?

రకుల్ ప్రీత్ సింగ్ గురించి ప్రత్యేకంగా పరిచయం అక్కర్లేదు. కన్నడ మూవీ 'గిల్లి'తో సినిమాల్లోకి ఎంట్రీ ఇచ్చింది. తెలుగులో తొలిసారిగా 'కెరటం'లో నటించింది. వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్ మూవీతో మంచి గుర్తింపును సాధించింది. ఆ తర్వాత సూపర్ స్టార్ మహేశ్‌బాబు, మెగా హీరో రామ్‌చరణ్, యంగ్ టైగర్ ఎన్టీఆర్ సినిమాల్లో అవకాశాలను దక్కించుకొని.. తక్కువ సమయంలోనే టాలీవుడ్‌లో అగ్ర హీరోయిన్‌గా ఎదిగింది. ప్రస్తుతం టాలీవుడ్‌కు దూరమైంది. చివరగా తెలుగులో కొండపొలం మూవీలో నటించింది. ఆ తర్వాత బాలీవుడ్‌లో బిజీగా మారింది. ప్రస్తుతం పెళ్లి చేసుకొని సెటిల్ అయ్యింది. పెళ్లయిన బాలీవుడ్‌లో సినిమాలు చేస్తూ వస్తున్నది. అయితే, ప్రస్తుతం సోషల్ మీడియాలో రకుల్ ప్రీత్ సింగ్‌పై ట్రోలింగ్ జరుగుతున్నది. దీపావళి పండుగ ఫైర్ క్రాకర్స్ గురించి చేసిన వ్యాఖ్యలను పలువురు సోషల్ మీడియాలో ట్రెండింగ్ చేస్తున్నారు. ఇంటర్వ్యూలో ఓ ప్రశ్నకు రకుల్ బదులిస్తూ.. 'దీపావళికి అంతా ఫైర్‌కాకర్స్ కాలుస్తుంటారు. చిన్నప్పుడు దీపావళి పండుగ సమయంలో మా పాప రూ.500 నోట్ ఇచ్చాడు. ఇప్పుడు రూ.500 ఎందుకిస్తున్నారు? అని అడిగాను. ఈ డబ్బుతోనే కదా నువ్వు ఫైర్‌కాకర్స్ కొని కాలుస్తావు. దాంతో ఎంత కాలుష్యమో తెలుసా? అని ప్రశ్నించారు. అదే డబ్బును అవసరం ఉన్న వారికి పేదవారికి ఇవ్వొచ్చని.. లేకపోతే చాక్‌లెట్స్, ఇంకా ఏమైనా కొని ఇవ్వచ్చని చెప్పారు. ఆయన చెప్పింది నిజమేనని అనిపించిందని, ఆ సమయంలో 5వ తరగతి చదువుతున్నాను. అప్పటి ఇప్పటి వరకు మళ్లీ బాణాసంచా కాల్చలేదు' అంటూ రకుల్ వివరించింది. ప్రస్తుతం ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి.



# లిప్‌లాక్ సీనా..? హీరోయిన్ ఎవరైనా సరే ఓకే చెప్తా: హీరో

బుల్లితెర నుంచి వెండితెరకు పరిచయమైన చాలామంది నటీనటులు ఇప్పుడు మంచి స్థాయికి చేరుకున్నారు. అలాంటి వారిలో నటుడు కవిన్ ఒకరు. లిఫ్ట్ చిత్రంతో కథానాయకుడిగా పరిచయమైన ఈయన ఆ తర్వాత డాడా చిత్రంతో మంచి విజయాన్ని సాధించారు. అదేవిధంగా స్టార్ చిత్రం ఈయనకి మంచి పేరు తెచ్చి పెట్టింది. తాజాగా కవిన్ కథానాయకుడిగా నటించిన బ్లడీ బెగ్గర్ చిత్రం దీపావళి సందర్భంగా గత నెల 31వ తేదీన విడుదలై ప్రదర్శింపబడుతోంది. నవంబర్ 7న తెలుగులో కూడా విడుదల కానుంది. ఈ సందర్భంగా ఒక భేటీలో ఏ హీరోయిన్‌తో లిప్‌లాక్ సన్నివేశంలో నటించాలని కోరుకుంటున్నారు అన్న ప్రశ్నకు అలాంటి కోరిక ఏమీ లేదని బదులిచ్చారు. అయితే కథకు అవసరమైతే ఏ నటితోనైనా లిప్‌లాక్ సన్నివేశంలో నటించడానికి సిద్ధమే అని పేర్కొన్నారు. ఇలా ఈయన చెప్పిన మాటలు ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. కారణం కవిన్ ప్రస్తుతం మాస్క్ అనే చిత్రంలో నటిస్తున్నారు. దీని తర్వాత నయనతార జంటగా ఒక చిత్రం చేయనున్నారు. దీనికి కిస్ అనే టైటిల్ నిర్ణయించినట్లు ప్రచారం జరుగుతుంది. ఇది రొమాంటిక్ లవ్ స్టోరీతో తెరకెక్కనున్న వైవిధ్య భరిత కథా చిత్రం అని సమాచారం. దీంతో ఈ చిత్రంలో నయనతార, కవిన్‌ల మధ్య లిప్‌లాక్ సన్నివేశాలు చోటు చేసుకోబోతున్నాయా అనే ఆసక్తి ఇప్పుడు సినీ వర్గాల్లో నెలకొంది.



# గాయాన్ని లైట్ తీసుకుంది.. ఇప్పుడేమో బాధపడుతూ

'కలర్ ఫోటో' మూవీతో హీరోయిన్‌గా బోలెడంత గుర్తింపు తెచ్చుకున్న తెలుగమ్మాయి. చాందిని చౌదరి.. తీవ్రంగా గాయపడింది. ఆ విషయాన్ని ఈమెనే స్వయంగా బయటపెట్టింది. అయితే చాన్నాళ్ల క్రితం ఇది జరగ్గా.. తాను లైట్ తీసుకున్నానని ఇప్పుడు అనుభవిస్తున్నానని చెప్పుకొచ్చింది.చాందిని ఏం చెప్పింది? హాలో.. నేను గత కొన్నిరోజుల నుంచి సోషల్ మీడియాలో యాక్టివ్‌గా లేను. ఎందుకంటే కొన్నాళ్ల క్రితం నాకు ఓ గాయమైంది. దాన్ని పెద్దగా పట్టించుకోకుండా షూటింగ్స్‌లో పాల్గొన్నాను. ఇప్పుడు ఆ గాయం తిరగబెట్టింది. షూట్ కోసం వెళ్తుంటే గాయం వల్ల మరింత నొప్పిగా అనిపిస్తుంది. దీంతో అన్నింటికి కొన్నాళ్లు దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నాను. మళ్లీ ఆరోగ్యం కుదుటపడిన తర్వాత సోషల్ మీడియాలోకి వస్తా' అని చాందిని చౌదరి ఇన్ స్టాలో స్టోరీ పోస్ట్ చేసింది. షార్ట్ ఫిల్మ్స్ నటిగా కెరీర్ మొదలుపెట్టిన చాందిని చౌదరి.. టాలీవుడ్‌లోనూ హీరోయిన్‌గా పలు సినిమాలు చేసింది. ఈ ఏడాది గామి, మ్యూజిక్ షాప్ మూర్తి, యేవమ్ చిత్రాలతో వచ్చింది. ప్రస్తుతం బాలకృష్ణ కొత్త మూవీలో నటిస్తోంది. బహుశా ఈమెకు సంబంధించిన చిత్రీకరణ పూర్తయినట్లు ఉంది. అందుకే కొన్నాళ్లపాటు రెస్ట్ తీసుకుంటానని చెప్పినట్లు అనిపిస్తోంది.



# టాలీవుడ్ దర్శకుడికి మరోసారి పెళ్లంటూ రూమర్స్

ప్రేమలో పడటం, పెళ్లి చేసుకోవడం, విడాకులు తీసుకోవడం, మళ్లీ పెళ్లి చేసుకోవడం.. ఇలాంటి మాటలు సినిమా ఇండస్ట్రీలో ఎప్పటికప్పుడు వినిపిస్తూనే ఉంటాయి. త్వరలో నాగచైతన్య కూడా ఇలానే మళ్లీ పెళ్లిచేసుకోబోతున్నాడు. హీరోయిన్ శోభిత ధూళిపాళ్లతో కొత్త జీవితం ప్రారంభించబోతున్నాడు. ఇదలా ఉంచితే తెలుగు దర్శకుడు క్రిష్ కూడా మరోసారి వివాహం చేసుకోబోతున్నాడనే రూమర్స్ ఇప్పుడు హాట్ టాపిక్ అయిపోయాయి.గమ్యం', 'వేదం' తదితర సినిమాలతో గుర్తింపు తెచ్చుకున్న క్రిష్.. 2016లో రమ్య అనే డాక్టర్‌ని పెళ్లి చేసుకున్నాడు.



కొన్నాళ్లు బాగానే ఉన్నారు కానీ మనస్పర్థలు వచ్చి 2021లో విడిపోయారు. అప్పటినుంచే సింగిల్‌గానే ఉంటున్న క్రిష్.. ఇప్పుడు కొత్త జీవితంలోకి అడుగుపెట్టేందుకు సిద్ధమయ్యాడట. ఓ లేడీ డాక్టర్‌తో త్వరలో పెళ్లి జరగనుందని తెలుస్తోంది. వచ్చే వారం మేరకు నిశ్చితార్థం జరుపుకోనున్నారనే టాక్ వినిపిస్తుంది. క్రిష్ పెళ్లి చేసుకోబోయే మహిళకు ఇదివరకే పెళ్లయి విడాకులు తీసుకుందని, 11 ఏళ్ల కొడుకు కూడా ఉన్నాడని అంటున్నారు. మరి ఈ రూమర్స్ నిజమేనా అనేది తెలియాల్సి ఉంది. చివరగా 'కొండపొలం' మూవీతో పలకరించిన క్రిష్.. పవన్ 'హరిహర వీరమల్లు' సినిమా మొదలుపెట్టాడు. ఇది జరిగి ఏళ్లు గడిచిపోయింది. పవన్ ఎంతకీ ఈ మూవీ గురించి పట్టించుకోకపోవడంతో దర్శకుడిగా ఇతడు పక్కకు తప్పుకొన్నాడు. ప్రస్తుతం అనుష్కతో 'ఘాటీ' మూవీ చేస్తున్నాడు. ఇంతలోనే ఇలా క్రిష్ పెళ్లి రూమర్స్ రావడం ఇండస్ట్రీలో హాట్ టాపిక్ అయిపోయింది.

Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Owned by Makam Gangadhar and Printed at MGR Publications, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. APTEL/2012/45151.